# మనం
## కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల-పెద్దపల్లి-ఆసిఫాబాద్-మంచిర్యాల

గురువారం | 16 | ఏప్రిల్ | 2026 | పేజీలు 14 | www.manamepaper.com




## యువత ప్రాణాలు అమూల్యం

- రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

**కరీంనగర్, ఏప్రిల్ 15(మనం న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా బుధవారం కరీంనగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్థానిక శాతవాహన యూనివర్సిటీలో అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ, మున్సిపల్, మరియు రవాణా శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ రోడ్డు భద్రతా వారోత్సవాల 3వ రోజు కార్యక్రమానికి జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ, ఈ నెల 13 నుండి 18 వరకు కమిషనరేట్ వ్యాప్తంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

2లో..

### ప్రభుత్వ పథకాలకు నిబంధనలకు అనుగుణంగా
## అర్హులను ఎంపిక చేయాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ –15(మనం ప్రతినిధి ):**ప్రభుత్వ పథకాలకు నిబంధనలకు అనుగుణంగా అర్హులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘ అభివృద్ధి సంస్థ (ఎస్సీ కార్పొరేషన్) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన " డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ" సమావేశాన్ని..

- మిగతా 2వ పేజీలో..



### రైతులకు నాణ్యమైన
## విత్తనాలు అందించడమే లక్ష్యం

- సీడ్స్ కార్పొరేషన్ విత్తనాలనే రైతులు వాడాలి
- విత్తన నాణ్యతే ప్రామాణికంగా తీసుకోవాలి
- తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

**కరీంనగర్ ఏప్రిల్ 15(మనం బ్యూరో) :** జిల్లాలో రాబోయే వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు విత్తన కొరత లేకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని దీంతోపాటు నాణ్యమైన విత్తనాలను తమ సంస్థ ద్వారా అందిస్తామని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి పేర్కొన్నారు.వానా కాలం సీజన్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించే అంశంపై బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో విత్తన డీలర్లు, సహకార సంఘాల సీఈఓలు, ఎఫ్‌పీఓలు, ఏఆర్ఎస్‌కే ప్రతినిధులతో చైర్మన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో విత్తన సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

2లో.




### కరీంనగర్ రోల్ మోడల్‌గా
## నిలవాలి

జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా




**కరీంనగర్ ఏప్రిల్ 15(మనం బ్యూరో) :** జిల్లాలో నిర్వహించనున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశాలను అత్యంత పకడ్బందీగా, ప్రజా పాలన ప్రతిబింబించేలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశాలు చారిత్రాత్మకంగా నిలిచేలా సమర్థవంతంగా నిర్వహించాలని ఆమె సూచించారు. ఈ నెల 16వ తేదీ గురువారం మండల స్థాయిలో జరిగే సమావేశాల నేపథ్యంలో బుధవారం సాయంత్రం జిల్లా స్థాయి అధికారులతో పాటు ఎంపీడీవోలు, ఎంఈఓలు, ఎంపీవోలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల స్థాయి సమావేశాలను విజయవంతం చేయడానికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సంక్షేమ పథకాల వారీగా..

- మిగతా 2వ పేజీలో..

## నిబంధనలకు అనుగుణంగా ఎంపిక చేయాలి

మొదటి పేజీ తరువాయి

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ ఎస్సీ యాక్షన్ ప్లాన్-2025-26 కి సంబంధించిన అంశాలు, మండలవారీగా లక్ష్యాలను కమిటీ ముందు ప్రవేశ పెట్టి వారి సంయుక్తంగా ఆమోదం పొందటం జరిగింది. అలాగే లబ్ధిదారుల ఎంపిక కోసం ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 గైడ్ లైన్స్ ప్రకారంగా “మండలస్థాయి ఎంపిక కమిటీ”ని ఏర్పాటు చేశారు. ఈడీ ఎస్సీ కార్పొరేషన్ కింద వ్యవసాయ రంగం ( సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్), పశు పోషణ రంగం ( 2 మిల్చ్ అనిమల్స్), రవాణా రంగం ఈవీ త్రీ వీలర్స్ (గూడ్స్), ఈవీ త్రీ వీలర్స్ (ప్యాసింజర్స్), ఈవీ టు వీలర్స్ పరికరాలు సబ్సిడీ పై అందుబాటులో ఉన్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. లబ్ధిదారుల, మండల స్థాయిలో లక్ష్యాల కేటాయింపు అన్నీ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత సమయంలో చేయాలని సూచించారు. సమావేశంలో ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, జనరల్ మేనేజర్ (జిల్లా పరిశ్రమలు) హనుమంతు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్ కుమార్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ రోల్ మోడల్‌గా నిలవాలి

మొదటి పేజీ తరువాయి



లబ్ధిదారుల.. వివరాలను వెల్లడించాలని సూచించారు. రైతు భరోసా, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, మహిళలకు రుణాలు, కార్పొరేషన్ల ద్వారా అందించిన రుణాలు, మహాలక్ష్మి పథకం, సన్నబియ్యం పంపిణీ వంటి అంశాలపై ప్రత్యేకంగా వివరించాలన్నారు. మండలాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. విద్య, వైద్యం, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, రైతు సంక్షేమం వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, అందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని తెలిపారు. అదేవిధంగా, రోడ్డు భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన “అరైవ్ అలైవ్” కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేయాలని, ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించాలని సూచించారు. జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలబెట్టే విధంగా సమావేశాలను నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీపీఓ జగదీశ్వర్, ఇన్‌చార్జి సీపీఓ రామ్ దత్తారెడ్డి, డీఎంహెచ్వో వెంకటరమణ, జెడ్పీ సీఈఓ శ్రీనివాస్, డీఎస్ఓ నర్సింగరావు, డీఆర్డీఓ శ్రీధర్, సంక్షేమ అధికారి సరస్వతి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ తదితర అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

సీడ్స్ కార్పొరేషన్ కరీంనగర్ యూనిట్ రంగపేట నుంచి నాణ్యమైన విత్తనాలను ఉమ్మడి జిల్లా రైతులకు సరఫరా చేస్తామని తెలిపారు. మన రైతులు పండించిన విత్తనాలనే సేకరించి, వాటిని అధునాతన ల్యాబ్‌లలో పరీక్షించి, నాణ్యత నిర్ధారణ అయిన తర్వాతే తిరిగి రైతులకు సాగు కోసం అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ కంపెనీలకు దీటుగా ప్రభుత్వ విత్తనాల నాణ్యత ఉంటుందని అన్వేష్ రెడ్డి గారు భరోసా ఇచ్చారు. రైతుల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా సంస్థ పనిచేస్తుందన్నారు. ప్రస్తుత సీజన్‌కు అవసరమైన వరి విత్తనాలు సమృద్ధిగా ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్లో డిమాండ్ ఉన్న సన్నారకల్లో ప్రధానంగా బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638 జేజీఎల్ 27356 రకాలను అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దొడ్డు రకాల విషయానికి వస్తే కెఎన్ఎం 118, ఎమ్‌టియు 1010 రకాలను నిల్వ ఉంచినట్లు తెలిపారు. వీటితో పాటు భూసారాన్ని పెంచే పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము పిల్లిపెసర రైతులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డీలర్లు ఎట్టి పరిస్థితులో సంస్థ విత్తనాలు అమ్మాల్సిందేనని సూచించారు. కేవలం రాయితీపై ఇచ్చే విత్తనాల విక్రయానికే పరిమితం కాకుండా, ప్రభుత్వం సేకరించిన అన్ని రకాల విత్తనాలను విక్రయించాలని ఆదేశించారు. లైసెన్స్ ఉన్న ప్రతి డీలర్ తప్పనిసరిగా ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలను తమ తమ దుకాణాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాటిపై విస్తృతంగా అవగాహన కల్పిస్తూ రైతులకు విక్రయించాలని సూచించారు.

జిల్లాలో వరి సాగు విస్తీర్ణం సుమారు 2.8 లక్షల ఎకరాలు వ్యవసాయ అధికారులు అంచనా వేశారని తెలిపారు. సుమారు 60వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని పేర్కొన్నారు. కనీసం 25 వేల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలను సంస్థ ద్వారా సరఫరా చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గ్రామాల్లో మహిళా సంఘాలు ప్రభుత్వ విత్తనాలను విక్రయించేందుకు పెద్ద ఎత్తున సహకరించాలని కోరారు. “రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా రక్షణ కల్పించడంతో పాటు, నిజాయితీగా వ్యాపారం చేసే డీలర్ల హక్కులను నూతన విత్తన చట్టం కాపాడుతుంది” అని ఆయన పేర్కొన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి అటు రైతులు



సంస్థ అభివృద్ధికి దోహదపడాలని కోరారు.

### గ్రామ గ్రామానా ప్రభుత్వ విత్తనాల విక్రయానికి ప్రత్యేక ప్రణాళిక..

గ్రామ గ్రామానా ప్రభుత్వ విత్తనాలను రైతులు పెద్ద ఎత్తున కొనుగోలు చేసేలా ప్రత్యేక ప్రణాళిక రచిస్తున్నామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ఇందుకోసం స్వశక్తి మహిళా సంఘాలు వ్యవసాయ అధికారులు పంచాయతీ కార్యదర్శుల సహకారంతో ముందుకు వెళ్తామన్నారు. ప్రభుత్వ విత్తనాల విక్రయం పై విస్తృతంగా గ్రామ గ్రామానా మార్కెటింగ్ నిర్వహించి పెద్ద ఎత్తున కొనుగోలు చేసేలా రైతులను అప్రమత్తం చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ విత్తనాలను రైతులు కొనుగోలు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. త్వరలో జిల్లా స్థాయిలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి ప్రభుత్వ విత్తనాల విక్రయం పై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు.

రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మోసపూరిత ప్రకటనల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కే మహేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్, జిల్లా సహకార అధికారి సీడ్ కార్పొరేషన్ మేనేజర్ రాజీవ్ కుమార్, కరీంనగర్ ప్రాంతీయ మేనేజర్ విష్ణు వర్ధన్ రెడ్డి, జిల్లా మహిళా సమైక్య అధ్యక్షురాలు సబిత, ఏడీఏలు, మండల వ్యవసాయ అధికారులు, విత్తన అధికారులు శ్రీకాంత్, మౌనిక, డీలర్లు, ఎఫ్‌పీఓ మహిళా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువత ప్రాణాలు అమూల్యం

మొదటి పేజీ తరువాయి

రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం యువతే ప్రాణాలు కోల్పోవడం ఆందోళనకరమని, దీనిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ డిఫెన్సివ్ డ్రైవింగ్' అలవాటు చేసుకోవాలని సూచించారు.

### మానవ తప్పిదాలే కారణం

హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, అపసవ్య మార్గాల్లో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లాలో గతేడాది 200 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించగా, అందులో ద్విచక్ర వాహనదారులే ఎక్కువ. పోలీసుల కఠిన చర్యల వల్ల ప్రమాదాల రేటు 17 శాతం తగ్గింది.

### ప్రభుత్వ ప్రోత్సాహం

ఈ పథకం కింద ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో రూ. 1.5 లక్షల వరకు ఉచిత నగదు రహిత చికిత్స అందుబాటులో ఉంది. హిట్ అండ్ రన్ బాధితులకు కూడా ఆర్థిక సాయం అందుతుంది. ప్రమాదం జరిగిన 'గోల్డెన్ అవర్'లో బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి ప్రభుత్వం రూ. 25 వేల బహుమతి అందజేస్తుంది. అనంతరం విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలు మరియు ర్యాగింగ్ నిరోధక చట్టాలపై సిపి అవగాహన కల్పించారు.

### డ్రగ్ ఫ్రీ యూనివర్సిటీగా శాతవాహన: వీసీ ఉమేష్ కుమార్

యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ యు. ఉమేష్ కుమార్ మాట్లాడుతూ, తమ విద్యాలయ ప్రాంగణం డ్రగ్ ఫ్రీగా ఉందని, ర్యాగింగ్ నిరోధానికి ప్రత్యేక కమిటీ పనిచేస్తోందని తెలిపారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు క్యాంపస్ అంతటా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

### ప్రతిజ్ఞ మరియు హెల్మెట్ల పంపిణీ

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలువురు విద్యార్థులకు యూనివర్సిటీ వీసీ ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి స్టేషన్ అధికారి (ట్రైనీ ఐపీఎస్) సోహం సునీల్, ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, రిజిస్ట్రార్ సతీష్ కుమార్ మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు మండల స్థాయి గ్రామసభ



కాసిపేట, ఏప్రిల్ 15(మనంన్యూస్)కాసిపేట మండల కేంద్రంలోని ముత్యంపల్లి రైతు వేదికలో గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ నిర్వహిస్తున్నట్టు మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్ తెలియచేశారు. బుధవారం తన కార్యాలయంలో పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో జరుగుతున్న పి 4 కార్యక్రమాలపై సమీక్ష చేశారు. మండల స్థాయి గ్రామసభ విజయవంతానికి అధికారులు బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో తాసీల్దార్ సునీల్ దేశ్ పాండే,మండల విద్యాధికారి వెంకటస్వామి,ఎంపీఓ సఫ్దర్ అలీ, మండల వ్యవసాయాధికారి ప్రభాకర్,ఏజీఎస్ అధికారులు, సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## రేచపల్లిలో ఎస్పీఎల్-3 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



సారంగాపూర్ మండలం ఏప్రిల్ 15 (మనం న్యూస్) : జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని రేచపల్లి గ్రామంలో సారంగాపూర్ మండల ప్రీమియర్ లీగ్ (ఎస్పీఎల్-3) క్రికెట్ టోర్నమెంట్‌ను రేచపల్లి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ బాస మహేష్, మండల ఎస్సై పాకాల గీత, కళ్యాణి దంత వైద్యశాల డాక్టర్ రాజేష్ హాజరయ్యారు. సర్పంచ్ బాస మహేష్ టాస్ వేయడం ద్వారా టోర్నమెంట్‌ను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత మరియు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామ స్థాయిలో ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడం ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రామడుగు సంతోష్ రావు, ప్రజా ప్రతినిధులు, క్రీడాకారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## 19న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

కాసిపేట, ఏప్రిల్ 15(మనంన్యూస్)కాసిపేట మండల కేంద్రంలో ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్ యందు, 2026-28 విద్యా ఏడాదికి 6 వ తరగతి నుండి 10వ తరగతి లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 19 ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలియచేశారు. 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10 గంటల నుండి, 7 నుండి 10 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుండి ఎక్జాం ఉంటుందని వెల్లడించారు. ఆన్లైన్ ద్వారా తమ హాల్ టికెట్లను విద్యార్థులు డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు.

## ఉద్యమకారునికి దక్కిన అరుదైన గౌరవం



జమ్మికుంట, ఏప్రిల్ 15 (మనం న్యూస్): జమ్మికుంట మండలం తనుగుల గ్రామానికి చెందిన ఉద్యమకారుడు అంబాల సదానందంకు అరుదైన గౌరవం దక్కింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో "ధూమ్ ధామ్" తో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ సందర్భంలో తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బోనమెత్తుకొని.. తనకున్న కళతో ప్రజల మనస్సును సదానందం గెలుచుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో వేదికలపై వందలాది కార్యక్రమాలలో బోనమెత్తుకొని నాడు ఉద్యమాన్ని కీలక దశలోకి తీసుకెళ్లడంలో తెలంగాణ ఉద్యమకారుడిగా తనదైన కీలకపాత్రను సదానందం పోషించారు. రాష్ట్రం ఏర్పడిన ఇన్నాళ్ల తర్వాత రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రస్తుత ప్రజాపాలనలో గుర్తింపు లభించింది. మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి ఆడిటోరియంలో తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన అంబాల సదానందం కు ఉత్సవ కమిటీ ఉపాధక్షులు బైరి వెంకటేష్ చేతుల మీదుగా దళిత రత్న అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా అంబాల సదానందం మాట్లాడుతూ... దళిత రత్న అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వానికి, 135వ అంబేద్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్, ఎస్సి, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఉత్సవ కమిటీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత రాష్ట్ర నాయకులు బత్తుల పాండు, సామజిక కార్యకర్త అంబాల రజనీకాంత్, జక్కే రాజేష్, అనిల్ సందీప్, అంబేద్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కుల సంఘంలో నూతన అధ్యక్షుని ఏకగ్రీవ ఎన్నిక



లక్షెట్టిపేట, ఏప్రిల్ 15 : (మనం న్యూస్) : మున్సిపల్ పరిధిలోని ఉత్కూర్ లో మాదిగ కుల సంఘం మాజీ అధ్యక్షులు అడ్లూరి కాంత రావు రాజీనామా చేయగా బుధవారం వారి భవనం వద్ద నూతన అధ్యక్షునిగా ఒరగంటి శ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. కుల హక్కుల సాధన కోసం ఎల్లప్పుడూ ముందుండాలన్నారు. వెనుక బడిన మన జాతికి రక్షణ కవచంలా అంబేద్కర్ ఆశయాలతో అన్నివేళలా తోడుండాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో దర్శనాల నవీన్ కుమార్, మాజీ ఎంపిటిసి స్వామి, మాజీ కౌన్సిలర్ ఒరగంట శ్రీకాంత్, నాయకులు బిరుదుల ధర్మయ్య, బెడియం నర్సయ్య, కల్లపల్లి విక్రమ్, అడ్లూరు సతీష్, దర్శనాల తిరుపతి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన




మంథని ఏప్రిల్15 (మనం న్యూస్) : అగ్నిమాపక వారోత్సవాలు రెండవ రోజు సందర్భంగా బుధవారం మంథని పట్టణంలోనీ బస్టాండ్, కూరగాయల మార్కెట్, అంబేద్కర్ నగర్, వివిధ రద్దీ గల ప్రాంతాలలో అగ్నిమాపక అధికారులు,సిబ్బంది కరపత్రాలు పంచుతూ అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తలు,అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. వేసవికాలం సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,వరి కోతలు జరుగుతున్న సందర్భంలో రైతులు వరిగడ్డిని కాల్చకుండా ఉండాలని ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర అధికారిశివశంకర వరప్రసాద్,ప్రధాన అగ్నిమాపకుడు సదానందం,వాహన చోదకుడు రమేష్, అగ్నిమాపకుడు శ్రవణ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి రూ.65 వేల ఆర్థిక చేయూత

ఇల్లందకుంట, ఏప్రిల్ 15 (మనం న్యూస్): హుజురాబాద్ ఏరియా ఆస్పత్రిలో సెక్యూరిటీ సిబ్బందిగా విధులు నిర్వర్తిస్తున్న ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన ముప్పు నరేష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మృతుడి బాల్యమిత్రులు బుధవారం మృతుడి స్వగృహానికి వచ్చి నరేష్ చిత్రపటానికి పూల మాలవేసి ఘన నివాళులు అర్పించారు. 2003-04 వరకు పదవ తరగతి సిరిసేడు ప్రభుత్వ పాఠశాలలో కలిసి చదివిన స్నేహితులు నరేష్‌తో పంచుకున్న జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. "మాతో కలిసి ఆడి పాడి చదువుకున్న మంచి మనసున్న వ్యక్తిని కోల్పోవడం ఎంతో బాధాకరం" అని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బాల్యమిత్రులతో పాటు ఇంటర్, డిగ్రీ చదివిన తోటి మిత్రులు కలిసి రూ.65 వేల నగదును మృతుడి భార్యకు అందజేశారు. మృతి చెందిన తమ స్నేహితుడి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ఎలాంటి సమస్యలు ఎదురైనా తోడుగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిరిసేడు గ్రామానికి చెందిన బాల్యమిత్రులు, ఇంటర్-డిగ్రీ మిత్రబృందం పాల్గొన్నారు.



# విద్యార్థి దశలోనే అవగాహన కలిగిస్తే భవిష్యత్తులో ప్రమాదాలను తగ్గించవచ్చు




గంగాధర, ఏప్రిల్ 15, ( మనం న్యూస్ ): రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, చిన్నప్పటి నుంచే విద్యార్థులలో సరైన అవగాహన కలిగిస్తే భవిష్యత్తులో ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని స్థానిక ఎస్సై బి. వంశీకృష్ణ పేర్కొన్నారు. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రోడ్ సేఫ్టీ - అరైవ్ అలైవ్ కార్యక్రమం లో భాగంగా గంగాధర మండలంలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాల విద్యార్థులతో కలిసి మధురానగర్ చౌరస్తా వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడం కోసం ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంపొందించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని, రోడ్డు నిబంధనలను పాటించడం, హెల్మెట్ ధారణ, సీట్ బెల్ట్ వినియోగం, అతివేగం వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. అనంతరం వివేకానంద పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి, విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు వ్యాస రచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల ద్వారా విద్యార్థులు రోడ్డు నిబంధనల ప్రాముఖ్యతను అర్థం చేసుకుని తమ ఆలోచనలను సృజనాత్మకంగా వ్యక్తపరిచారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన మొదటి ఐదు మంది విద్యార్థులకు ఎస్సై వంశీకృష్ణ స్వయంగా బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పర్రెం లక్ష్మారెడ్డి, డైరెక్టర్ గుడి అనంతరెడ్డి, ప్రధానోపాధ్యాయులు నర్సింగరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానిక ప్రజలు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు రాగిజావా పంపిణీ చేసిన సర్పంచ్ కళ్యాణ్

గంగాధర, ఏప్రిల్ 15, ( మనం న్యూస్ ): గంగాధర మండలం బురుగుపల్లి గ్రామంలో సర్పంచ్ దూలం కళ్యాణ్ గౌడ్ ఉపాధి హామీ కూలీలకు ప్రతిరోజు సొంత ఖర్చుతో చల్లని త్రాగునీరు, రాగి జావా, రవాణా సౌకర్యం అందించి పలువురి మన్ననలను పొందుతున్నారు. వేసవిలో మండుటెండల కారణంగా ఉపాధి హామీ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూలీలు వడదెబ్బ బారిన పడకుండా పని ప్రదేశాల్లో మెడికల్ క్యాంపు, చల్లని తాగునీరు, రాగి జావా ఏర్పాటు చేసి కూలీలకు అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కూలీలకు ఏదైనా సమస్య ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయగా, గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కూలీల సమస్యలపై ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. అంతేకాకుండా గ్రామంలో పంట కాలువలు, చేపల చెరువుల పూడికతీతలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే త్వరలో గౌడ సామాజిక వర్గానికి రెండువేల ఈత వనం మొక్కలను నాటనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో దమ్మని రాము బుధవారం బూరుగుపల్లి గ్రామంలోని ఉపాధి హామీ కూలీల పనితీరును పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలకు ఎంపీడీవో రాగిజావను అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్లాస్టిక్ గ్లాసులతో క్యాన్సర్ లాంటి దుష్ప్రభావాలు లేకుండా సర్పంచ్ మల్టీ స్టీల్ గ్లాసులు వినియోగించడంపై ఆనందం వ్యక్తం చేస్తూ కూలీలకు రాగి జావా అందించారు. అనంతరం స్థానిక సర్పంచి దూలం కళ్యాణ్ గౌడ్ కూలీలకు కల్పించిన సదుపాయాలను ఎంపీడీవో అభినందించారు.



# గంగాధరలో ప్రారంభమైన ప్రిమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్




గంగాధర, ఏప్రిల్ 15, ( మనం న్యూస్ ): గంగాధర మండల కేంద్రంలో ఎడ్ల అనిల్, అనూష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గంగాధర ప్రిమియర్ లీగ్ సేషన్ 8 క్రికెట్ టోర్నమెంట్ ను మధురానగర్ సర్పంచ్ వేముల భాస్కర్, ఉప సర్పంచ్ తూము రాజు, కురిక్యాల మాజీ సర్పంచ్ మేచినేని నవీన్ రావు ప్రారంభించారు. 15 రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో 8 జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులు ఠాగూర్ కింగ్స్ జట్టుకు శ్రీ వరలక్ష్మి ట్రేడర్స్ అవుదుర్తి మహేష్ టీ షర్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఠాగూర్, మడ్లపెల్లి రమేష్, ప్రశాంత్ రెడ్డి, విక్రమ్, మోతె శ్రీహరి, పెంచాల చందు, గుంటి సంజీవ్, పెరుక మహేష్, బాచి, పిట్టల ప్రవీణ్, పృథ్వి, మనోజ్, కిరణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందజేత



గంగాధర, ఏప్రిల్ 15, ( మనం న్యూస్ ) : గంగాధర మండలం ఉప్పర మల్యాల గ్రామానికి చెందిన కంకణాల వెంకటమ్మకు పలువురు దాతలు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. గత కొద్దిరోజుల క్రితం వెంకటమ్మ భర్త కంకణాల లచ్చిరెడ్డి అనారోగ్యంతో మరణించారు. ఆయన సతీమణి వెంకటమ్మకు ఉండడానికి ఇల్లు లేకపోవడంతో ఆమెకు ఒక రూమ్ నిర్మించడానికి పలువురు దాతలు ముందుకు రాగా రెడ్డి సంఘం వారు 20 వేలు, గంగాధర లయన్స్ క్లబ్ 13 వేల 5 వందలు, గ్రామంలోని దాతలు 18 వేలు సహాయం చేయగా మొత్తం 51 వేల 5 వందల రూపాయలు పోగయ్యాయి. ఇట్టి రూపాయలను బుధవారం వెంకటమ్మకు అందజేశారు. ఇంకా ఎవరైనా దాతలు ముందుకు రావాలని గ్రామ ప్రజలకు కోరారు.

# వృద్ధురాలిపై కోతుల దాడి



సుల్తానాబాద్ ఏప్రిల్ 15 (మనం న్యూస్): అడవుల్లో ఉండాల్సిన కోతులు ఊళ్లలోకి వస్తున్నాయి. రైతుల పంటలతో పాటు మనుషుల ప్రాణాలతో కూడా ఆడుకుంటున్నాయి. తాజాగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ గాంధీనగర్ లో కోతులు ఎనగంటి లక్ష్మి (65) వృద్ధురాలి పై దాడి చేసి గాయపరిచాయి. కోతుల దాడిలో గాయపడిన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. బుధవారం సాయంత్రం గాంధీనగర్ లో ఓ ఇంట్లోకి కోతులు వచ్చాయి. వాటిని తరిమేందుకు ఎనగంటి లక్ష్మి (65)ప్రయత్నించింది. ఆగ్రహించిన కోతులు లక్ష్మి పై దాడి చేశాయి. ఈ సమయంలో ఆమె కేకలు వేస్తూ బయటకు వచ్చింది. చుట్టు పక్కల వారు వచ్చేసారికి కోతులు వెళ్లిపోయాయి. అయితే తమకు కోతులు ఇబ్బందిగా మారాయని పాఠశాలలకు వెళ్లే చిన్నపిల్లలు సైతం ఇబ్బందులకు గురి చేసన్నాయని సుల్తానాబాద్ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా కోతులను అడవికి తరిమికొట్టాలని డిమాండ్ చేశారు.

**సుల్తానాబాద్‌లోనే కాదు**

కోతులు ఒక్క సుల్తానాబాద్ లోనే కాదు.. పెద్దపల్లి జిల్లా లోనే పలు గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువగా ఉంది. రైతులు మొక్కజొన్న, కూరగాయల పంటలు వేస్తే వాటిని కోతులు నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ కోతుల బాధ నుండి విముక్తి చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# జమ్మికుంట మున్సిపాలిటీలో అవినీతికి పాల్పడ్డ సిబ్బందికి అండగా నిలుస్తున్నది ఎవరో..?

**-అవినీతి అక్రమాలు వెలుగులోకి వచ్చిన బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేంటి...?**

**-రాజకీయ ఒత్తిళ్లతోనే అధికారులు వెనుకడుగు వేస్తున్నారా...?**



జమ్మికుంట, ఏప్రిల్ 15 (మనం న్యూస్): ఏదైనా ఒక ప్రభుత్వ కార్యాలయంలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని తెలితే బాధ్యులపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. కాని అందుకు భిన్నంగా జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో మాత్రం అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని విజిలెన్స్, ఏసీబీ అధికారులు తేల్చినప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో కాలయాపన జరుగుతుండడం పలు అనుమానాలకు తావిస్తుంది. ప్రజల సొమ్మే కదా ఎవరు తింటే మాకు ఏంటి అని సంబంధిత అధికారులు అనుకుంటున్నారో ఏమో తెలియదు కాని ప్రజాధనాన్ని అప్పనంగా కాజేసిన వారే మమ్ముల్ని ఎవరేమి చేయరు మాకు పెద్దల అండ ఉందనే ధైర్యంతో వారి వారి పనులలో ఏమి జరగనట్టు నిమగ్నమవుతుండడం చూస్తుంటే ఆశ్చర్యం కలగక మానదు. మున్సిపల్ అధికారులు మాత్రం ఇంటి పన్నుల వసూళ్లపై చూపే శ్రద్ధను కార్యాలయం పరిధిలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో చూపలేకపోతున్నారు. సుమారు సంవత్సర కాలం క్రితం నుంచి విజిలెన్స్ అధికారుల విచారణ, మరోవైపు గత నాలుగు నెలల క్రితం ఏసీబీ అధికారుల ప్రత్యేక తనిఖీలు చేపట్టడంతో జమ్మికుంట మున్సిపాలిటీలో జరిగిన అవినీతి, అక్రమాలు, విధుల పట్ల అధికారుల నిర్లక్ష్యం ఒక్కొక్కటిగా బయటపడ్డాయి. మున్సిపాలిటీలో అవినీతి అక్రమాలు చోటు చేసుకుంటే ఐదేళ్ల కాలంలో కమిషనర్లుగా విధులు నిర్వర్తించిన అధికారులు అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు నిర్లక్ష్యం వహించడంలో ఆంతర్యం ఏంటో అర్థం కావడం లేదు. ఇంటి పన్నుల వసూళ్లలో చూపిన శ్రద్ధను మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికట్టడంలో ఎందుకు చూపలేదంటూ పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**మున్సిపాలిటీలో అవినీతికి పాల్పడ్డ సిబ్బందికి అండగా నిలుస్తున్నదేవరో..?**

జమ్మికుంట మున్సిపాలిటీలో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్, ఏసీబీ అధికారులు చేపట్టిన వేరువేరు తనిఖీలలో అవినీతి అక్రమాలు వెలుగులోకి వచ్చిన విషయం విధితమే. నిబంధనలకు విరుద్ధంగా లక్షలాది రూపాయల నిధులు డ్రా చేసిన తీరు, కొన్ని అభివృద్ధి పనులు పూర్తిగా జరగకపోయిన బిల్లులు సిద్ధం చేసి చెల్లింపులు జరిగిన విధానం, అంచనాలకు మించి చెల్లింపులు చేయడం, రికార్డుల్లో తారుమారు జరగడం వంటి అంశాలను విజిలెన్స్ అధికారులు గుర్తించినట్లు తెలిసింది. గతంలో జూనియర్ అకౌంటెంట్ గా పనిచేసిన ఉద్యోగిని ఆమె ఇక్కడ పనిచేసిన సమయంలో బిల్లుల చెల్లింపులో నిబంధనలు ఉల్లంఘించినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఫార్ములకు సంబంధించి చెల్లించాల్సిన సుమారు అరకోటి రూపాయల వరకు కార్యాలయంలో పనిచేసే ఒక ఉద్యోగి, ఇద్దరు పొరుగు సేవా ఉద్యోగుల పేర్లపై చెల్లించినట్లు తెలిసింది.

ఏసీబీ అధికారుల తనిఖీలలో... జమ్మికుంట మున్సిపల్ లో అస్తవ్యస్తంగా రికార్డుల నిర్వహణ, భవన అనుమతులకు సంబంధించిన రికార్డ్ క్రమ పద్ధతిలో లేకపోవడం, ఒక్క జెసిబి వాహనానికే రోజుకు రూ.5000 డీజిల్ ఖర్చు చేస్తున్నట్లు లెక్కల్లో చూపాడం, పనిచేయని వాహనాలకు సైతం డీజిల్ బిల్లులు క్లైమ్ చేసుకున్నట్లుగా ఏసీబీ అధికారులు గుర్తించారు. భవన నిర్మాణ అనుమతులను పర్యవేక్షించే అధికారి సెల్ ఫోన్ తో పాటు, లెక్కల్లో చూపని రూ.41,170 లను, శానిటేషన్ విధులు నిర్వర్తించే పొరుగు సేవా ఉద్యోగి సెల్ ఫోన్ ను సైతం స్వాధీనం చేసుకొని విచారణ చేపడుతున్నప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో కాలయాపన జరుగుతుండడం పలు అనుమానాలకు తావిస్తుంది. మున్సిపాలిటీలో ఇంతటి భారీ స్థాయిలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని విజిలెన్స్, ఏసీబీ అధికారులు గుర్తించినప్పటికీ అవినీతి, అక్రమలకు పాల్పడిన ఉద్యోగులు, పొరుగు సేవా సిబ్బంది నేటి వరకు విధులలో కొనసాగుతున్న తీరు చూస్తుంటే వారికి అండగా నిలుస్తున్నదేవరో అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఇద్దరు పొరుగు సేవ ఉద్యోగుల కనుసన్నల్లోనే మున్సిపల్ కార్యాలయ నిర్వహణ జరుగుతున్న తీరు చూస్తుంటే ఆశ్చర్యం కలగకమానదు.

**అవినీతి అక్రమాలు వెలుగులోకి వచ్చిన బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేంటి...?**

జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో గత ఆరేళ్లలో పనిచేసిన, పనిచేస్తున్న మున్సిపల్ (కమిషనర్) అధికారులతో పాటు పలువురు ఉద్యోగుల పనితీరుపై విజిలెన్స్, ఏసీబీ అధికారులు చేపట్టిన విచారణలో ఆయా సమయాలలో పనిచేసిన కమిషనర్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన తీరు స్పష్టంగా కనిపించింది. కమిషనర్లు తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో కొంతమంది మున్సిపల్ ఉద్యోగులతో పాటు ఇద్దరు పొరుగు సేవా ఉద్యోగులు తాము ఆడింది ఆట పాడింది పాటగా వ్యవహరించారు. మున్సిపాలిటీలో రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తం, నిధుల దుర్వినియోగం, పొరుగు సేవ ఉద్యోగి, కార్యాలయ సిబ్బంది అవినీతి, అక్రమాలకు పాల్పడుతుంటే ఆయా సమయాల్లో పనిచేసిన కమిషనర్లు వారిపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడం వెనుక ఉన్న ఆంతర్యమేంటో అర్థం కావడం లేదు. మున్సిపల్ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఇక్కడ పనిచేసే వెళ్లిన ఉద్యోగినితోపాటు ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగి, పొరుగు సేవ ఉద్యోగి, కార్యాలయ రికార్డుల అస్తవ్యస్తతకు కారణమైన మున్సిపల్ ఉద్యోగులపై రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా శాఖపరమైన చర్యలు కోవలసిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ పరిధిలోని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## నేడు గంగాధర ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు



గంగాధర, ఏప్రిల్ 15, ( మనం న్యూస్ ): గంగాధర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేడు ఉదయం 9 గంటల నుండి ఈసీజీ, ఎక్స్ రే వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ శ్వేతా పేర్కొన్నారు. గుండె సమస్యలను, హృదయ స్పందనలో మార్పులను, గుండెపోటు వంటి పరిస్థితులను గుర్తించడానికి ఈసీజీ పరీక్ష చేపించుకోవాలని, అలాగే ఎక్స్‌రే ద్వారా ఛాతీ నొప్పి లేదా ఊపిరితిత్తుల సమస్యల నిర్ధారణ కోసం ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. రోగులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఆసుపత్రిలోని డయాగ్నోస్టిక్ విభాగాన్ని సందర్శించి ఈ సేవలను వినియోగించుకోవాలని, ఈసీజీ, ఎక్స్ రే అవసరమైన వారు ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

## గుండ్లపాడ్ గ్రామంలో గంజాయి మొక్కలు




కాసిపేట, ఏప్రిల్ 15(మనంన్యూస్)కాసిపేట మండలం గుండ్లపాడ్ గ్రామంలో దొంగచాటుగా, ఇంటి ఆవరణలో, ప్రభుత్వ నిషేధిత గంజాయి మొక్కలను పెంచుతున్న మడావి అర్జు అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై ఆంజనేయులు, మందమర్రి సిఐ రమేష్ లు తెలియచేశారు. అటవీ శాఖ, రెవెన్యూ అధికారులు ఉమ్మడిగా దాడి చేసి, 8 అడుగుల ఎత్తు ఉన్న 5 గంజాయి మొక్కలు వాటి విలువ సుమారు రూ,50 వేలు వరకు ఉంటుందని వారు వెల్లడించారు. సంఘటన స్థలాన్ని బెల్లంపల్లి ఎసిపి కిరణ్ కుమార్ సందర్శించి, కేసు విషయమై ఆరా తీసినట్టు తెలిపారు. ప్రభుత్వ నిషేధిత గంజాయి, మత్తు పదార్థాలను సాగు చేసిన,విక్రయించిన. రవాణ చేసిన, సేవించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేశారు. అలాంటి వారి సమాచారం పోలీస్ లకు అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

## గంగాధర మండల బీజేపీ నూతన కార్యవర్గం ఎన్నిక



గంగాధర, ఏప్రిల్ 15, ( మనం న్యూస్ ): గంగాధర మండల బీజేపీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు గంగాధర మండల అధ్యక్షులు పంజాల ప్రశాంత్ పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగిడి కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు నూతన కార్యవర్గాన్ని బుధవారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా గంకిడి చంద్రారెడ్డి, గుండెల్లి మల్లేశం, బొమ్మ కంటి రాజిరెడ్డి, హర్ష రాజు, ప్రధాన కార్యదర్శులుగా తాళ్ల రాజశేఖర్, రేండ్ల శ్రీనివాస్, కార్యదర్శులు గాలి పెల్లి శ్రీనివాస్, జాతర కొండ మహేష్, జోగు అజయ్, సుద్దాల వంశీ కృష్ణారెడ్డి, కోశాధికారిగా ఆదిపెల్లి పృథ్వీ, కార్యవర్గ సభ్యులుగా మల్యాల పోచయ్య, పుల్కం లక్ష్మణ్, బత్తిని శ్రీధర్, బట్టు చంద్రశేఖర్, గంగాధర రవి, పబ్బతి వెంకటరెడ్డి, వోడ్నాల లక్ష్మణ్, గుంటుకు రవీందర్, గాలిపెల్లి కిరణ్, బైరి ప్రభాకర్ రెడ్డి లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు పంజాల ప్రశాంత్ మాట్లాడుతూ నూతన కార్యవర్గం సమన్వయంతో పనిచేస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గ్రామాలలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## గుండెపోటుతో ఆటో కార్మికుడు మృతి

శంకరపట్నం ఏప్రిల్ 15 (మనం న్యూస్) : గుండెపోటుతో ఓ ఆటో కార్మికుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన ఘటన శంకరపట్నం మండలంలోని, మొలంగూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మొలంగూర్ గ్రామానికి చెందిన అబ్దుల్ వహీద్ అనే ఆటో కార్మికుడు ఆటో నడుపుతూ తన కుటుంబాన్ని పోషించుకుంటాడని, మంగళవారం ఆటో నడుపుతుండగా వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు, కరీంనగర్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స కోసం వహీదును చేర్పించగా చికిత్స పొందుతున్న వహీద్ పరిస్థితి విషమించి బుధవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గ్రామస్తులు తెలిపారు. వహీద్ మృతితో మొలంగూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## గర్భిణీ, బాలింతలు పౌష్టిక ఆహారం తీసుకోవాలి




శంకరపట్నం ఏప్రిల్ 15 (మనం న్యూస్) : గర్భిణీ స్త్రీలు బాలింతలు పౌష్టిక ఆహారం తీసుకున ఆరోగ్యంగా ఉండాలని ఐసిడిఎస్ కరీంనగర్ రూరల్ ప్రాజెక్ట్ సిడిపిఓ శ్రీలత అన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలంలోని ముత్తారం, కొత్తగట్టు గ్రామాల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని అంగన్వాడి కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిడిపిఓ శ్రీలత మాట్లాడారు. గర్భిణీ స్త్రీలు బాలింతలు నాణ్యమైన నూనె, పోషక ఆహారం తీసుకోవాలని, నాణ్యమైన పోషకాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని, పోషకాహారం పై సూచించారు. మహిళల చిన్నారుల ఆరోగ్యం కోసం అర్హులైన ప్రతి ఒక్కరికి అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందని అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ కవిత ఐసిడిఎస్ మండల సూపర్వైజర్లు అరుణ, పద్మ, గ్రామాల అంగన్వాడీ టీచర్లు ఆయాలు మహిళలు గర్భిణీ స్త్రీలు చంటి పిల్లల తల్లులు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## గుంపుల వారసంతలో రోడ్డు భద్రతపై అవగాహన



ఓదెల ఏప్రిల్ 15,(మనం న్యూస్) : పెద్దపల్లి జిల్లా వదల మండలం గుంపుల వారసంతలో బుధవారం పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్ ట్రాఫిక్ నియమాలు పాటించాలని కూరగాయల సంత వ్యాపారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. గుంపుల గ్రామంలో వారసంత లో ట్రాఫిక్ నియమాల పాటించిన కూరగాయల మార్కెట్ వ్యాపారులు గుంపుల గ్రామంలోని కూరగాయల మార్కెట్ వ్యాపారులు ట్రాఫిక్ నియమాలను గొప్పగా పాటిస్తూ మార్గదర్శకులకు ఉదాహరణగా నిలుస్తున్నారన్నారు.. వీరు మార్కెట్ ప్రాంగణంలో వాహనాలను సరైన చోట పార్క్ చేయడం,రోడ్డు మధ్య అడ్డంకులు లేకుండా చూసుకోవడం,పాదచారులకు,ఇతర వాహనదారులకు దారి ఇవ్వడం వంటి నియమాలను కఠినంగా పాటిస్తున్నారని పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్ తెలిపారు. ఈ మార్కెట్‌లో 50 మంది కంటే ఎక్కువ మంది వ్యాపారులు రోజు ఈ నియమాలను పాటిస్తూ,ట్రాఫిక్ జామ్‌లను నివారిస్తూ గ్రామ ప్రజలకు సౌకర్యం కల్పిస్తున్నారన్నారు. ఇలాంటి చిన్న చిన్న చర్యలు పెద్ద మార్పును తీసుకొస్తాయని,అందరూ ఇలా సహకరిస్తే రోడ్డు రక్షణ మరింత మెరుగవుతుందని పొత్కపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ దీకొండ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంపుల సర్పంచ్,గ్రామ ప్రజలు, వ్యాపారాలు పాల్గొన్నారు.

# అమృత రాజయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాము



మంథని,ఏప్రిల్15 (మనం న్యూస్): బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే పవర్ హౌస్ కాలనీలో అమృత రాజయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని,ఈ కాలనీ నిర్మాణానికి కృషిచేసిన అమృత రాజయ్య పేరును ఈ కాలనీకి నామకరణం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం మంథని పట్టణంలోని పవర్ హౌస్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు ఏగోళపు శంకర్ గౌడ్ సీనియర్ నాయకుడు తగరం శంకర్ లాల్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్‌పై జరుగుతున్న రాజకీయ దాడులు, బెదిరింపులను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. బీ ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు అధికార కాంగ్రెస్ పార్టీ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. పవర్ హౌస్ కాలనీ అణగారిన వర్గాల పోరాటాల గడ్డ అని గుర్తు చేసిన నాయకులు,1983-85 కాలంలోనే అశోక్ కుమార్ నాయుడు, అమృత రాజయ్య వంటి మహనీయులతో కలిసి ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీల కోసం పోరాడి గుడిసెలు వేయించిన చరిత్ర తమదేనని తెలిపారు. పేదల కోసం పోరాడిన అమృత రాజయ్య విగ్రహాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, గతంలోనే ఈ విషయాన్ని పుట్ట మధూకర్ ప్రతిపాదించారని వారు వెల్లడించారు. తమ బీఆర్ఎస్ పరిపాలనలో మంథనిలో మంథని మొదటి ఎమ్మెల్యే గులుకోట శ్రీరాములు, మాజీ ఉపరాష్ట్రపతి బాబు జగ్జీవన్ రావు, సర్వేపల్లి రాధాకృష్ణ, మహాత్మ జ్యోతిరావు పూలే,కొమరం భీం, బిపి మండల్,చాకలి ఐలమ్మ,సర్దార్ పాపన్న గౌడ్,గిట్ల జనార్దన్ రెడ్డి, తెలుగుదేశం వ్యవస్థాపకులు,మాజీ ముఖ్యమంత్రి ఎన్టి రామారావు లాంటి అనగారిన వర్గాల కోసం పోరాటం చేసిన మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఇటీవల మంథనిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి సమక్షంలోనే రామగుండం ఎమ్మెల్యే చేసిన"నరికేస్తాం"అనే వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం హింసను ప్రేరేపించే చర్యగా వారు అభివర్ణించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్‌కు ఉన్న గన్‌మెన్‌లను తొలగించడం వెనుక కుట్ర ఉందని ఆరోపించిన నాయకులు,ఆయనకు ఏ చిన్న అపాయం జరిగినా ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పుట్ట మధూకర్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బొక్కల వాగు సుందరీకరణకు కృషి చేశారని,ప్రస్తుతం ఆ వాగు మురికికూపంగా మారుతున్నా ఇప్పటి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. విధ్వంసక వాక్యాలు మానుకొని అభివృద్ధి చేయాలని హితవు పలికారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పుట్ట మధన్న నాయకత్వంలో తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ శ్రేణులు స్పష్టం చేశాయి. ఈ విలేకరులసమావేశంలో మంథని మున్సిపల్ కౌన్సిలర్ మాచిడి.రాజుగౌడ్, మాజీ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్,మాజీ కౌన్సిలర్ కాయితీ సమ్మయ్య,మాజీ వైస్ ఎంపీపీ వేల్పుల గట్టయ్య,మాజీ ఎంపిటిసి శ్రీనివాస్, నాయకులు పుప్పాల తిరుపతి,పోలు కనకరాజు,అసిఫ్,పిల్లి సత్యనారాయణ, మాదాసు అనిల్, సంతోష్,శ్రీకాంత్, పెంటరీ శ్రీనివాస్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలి..!



గంగాధర, ఏప్రిల్ 15, ( మనం న్యూస్ ): సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు విద్యా వాహిని బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రతి ఏడాది జూన్ లో ప్రారంభం అయ్యే బడిబాట కార్యక్రమం గంగాధర మండలంలో మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో ఈనెల 11న మొదలుపెట్టారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారే ఈరోజు ఉన్నత స్థానాలకు చేరుకున్నారని, ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్న స్థానిక ఎమ్మార్వో అంబటి రజిత, ఎంపీడీవో ధమ్మని రాము, ఎస్సై బి. వంశీకృష్ణ చిత్రాలను వాహనంపై ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ప్రదర్శిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా తన హైస్కూల్ విద్యను ప్రభుత్వ పాఠశాలలోనే పూర్తి చేశారనే విషయం ప్రజలకు ప్రేరణగా తెలియజేస్తున్నారు. విద్యా వాహిని వాహనంపై ఆకర్షణీయమైన ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న మౌలిక సదుపాయాలు, బ్రేక్‌ఫాస్ట్ మెనూ టైమ్‌టేబుల్ చిత్రాలను ఏర్పాటుచేసి ప్రదర్శిస్తున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు మాట్లాడుతూ రాష్ట్రవిద్యాశాఖ ప్రభుత్వ ఉపాధ్యాయులను అలర్ట్ చేయడంతో ప్రిన్సిపల్ సెక్రటరీ యోగిత రాణా సూచనలతో జిల్లా ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో నిర్వహించబడుతోందని అన్నారు. గంగాధర మండలంలోని

33 గ్రామ పంచాయతీలలోని 37 పాఠశాలలను కవర్ చేస్తూ ఈ నెల 24 వరకు ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు బడిబాట కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాటలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో అత్యంత విద్యావంతులై, మంచి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని ప్రైవేట్ పాఠశాలలు కాకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులను మోటివేట్ చేస్తున్నామని, గత సంవత్సరంలో 481 కొత్త అడ్మిషన్లు నమోదు కాగా, ఈ సంవత్సరం 500కు పైగా అడ్మిషన్లు లక్ష్యంగా నిర్ణయించుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు చురుకుగా పాల్గొంటున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి ఆసక్తి చూపిస్తున్నారని అన్నారు. కాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధుల విద్యార్థులు కార్పొరేట్ (ప్రైవేట్) పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలో చేరడం ఇది ప్రభుత్వ పాఠశాలలపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు.

## ప్రమాదవశాత్తు చెరువులో మునిగి వ్యక్తి మృతి



వెల్గటూర్ ఏప్రిల్ 15 (మనం న్యూస్): ప్రమాదవశాత్తు చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కప్పారావుపేట గ్రామంలో చోటుచేసుకుంది ఎస్సై పి ఉదయ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు ముక్కట్రావుపేట గ్రామానికి చెందిన అంకతి పెద్ద కోటయ్య (65) అనే వృద్ధుడు మంగళవారం ఉదయం తమ పశువులను మేపడానికి ఇంటి నుండి వెళ్లిగా పశువులు మేపే క్రమంలో కప్పారావుపేట చెరువులోకి పశువులు వెళ్లగా వాటిని మళ్ళించే ప్రయత్నం లో ప్రమాదవశాత్తు చెరువు నీటిలో మునిగి మృతి చెందాడని, మృతుడి కొడుకు అంకతి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై పి ఉదయ్ కుమార్ తెలిపారు.

## నేడు సంక్షేమ పథకాలపై మండల స్థాయి సమావేశం



గంగాధర, ఏప్రిల్ 15, ( మనం న్యూస్ ): తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రజా సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దమ్మని రాము పేర్కొన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు భరోసా, మహాలక్ష్మి పథకం, సన్న వడ్ల రకం కొనుగోలు బోనస్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పెన్షన్ల పథకం, ఇందిరమ్మ మహిళా శక్తి, ఇందిరమ్మ చీరల పంపిణీ పథకం ఇందిరమ్మ చీరల పంపిణీ పథకం, ఎంపీపీ, జెడ్ పి పి నిధుల కింద చేపట్టిన పనులపై అవగాహన కల్పించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శిలు, వివో లు, ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి అందరూ హాజరు కావాలని సూచించారు.

## నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేపట్టాలి

దండేపల్లి ఏప్రిల్ 15 (మనం న్యూస్) : ఆరుగాలం కష్టపడి పండించే పంటను విక్రయించేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారని కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల తీరుతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మంచిర్యాల నియోజకవర్గ రైతు జేఏసీ కన్వీనర్ గాదె శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు పండించిన ధాన్యాన్ని తూకం వేసిన తర్వాత లెక్కలు చేసి ఎంత నగదు వస్తాయో రసీదు రూపంలో రైతుకు అందజేయాల్సిన నిబంధనలు ఉన్న అందుకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వ్యవహరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటు లారీల పరిస్థితి రైతే చూసుకోవాలి అటు మిల్లర్లు కటింగ్ అంటే రైతే చూసుకోవాల్సిన అధ్వాన పరిస్థితి దాపురించిందని ఆయన అన్నారు. దీంతో రైతు నష్టపోయే పరిస్థితి దాపురించిందని అన్నారు. ధాన్యం అమ్మక విషయంలో రైతుకు నేరుగా రవాణాకు సంబంధించి మిల్లర్లకు సంబంధించి ఎటువంటి అనుబంధం లేకున్నా రైతు అందుకు నిబంధనలు ఉన్న ఎవరు కూడా పాటించడం లేదని అన్నారు. జిల్లా ఉన్నతాధికారులు అటువంటి పరిస్థితి రాకుండా చూసి ధాన్యం సకాలంలో కొనుగోలు చేసి రైతు ఖాతాలో నగదు జమ అయ్యేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు సంఘం నాయకులు పాల్గొన్నారు.



## పిఎస్ఆర్ చొరవతో నెరవేరిన గ్రామస్తుల చిరకాల స్వప్నం

వెల్గటూర్, ఏప్రిల్ 15(మనం న్యూస్): రీల్ లైఫ్ శ్రీమంతుడు కాదు రియల్ లైఫ్ హీరో పొనుగోటి అంటున్నారు మండలంలోని పాత గూడూరు గ్రామస్తులు. ఊరి కోసం ఏదైనా చేయాలనే తపన పిఎస్ఆర్ ది హామీలు ఇవ్వడమే కాదు ఆచరణ లో చేసి చూపుతున్నారు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాసరావు. మండలంలోని పాత గూడూరు గ్రామస్తుల చిరకాల స్వప్నం పాత పోచమ్మ ఆలయ రహదారి, ఇది ఏళ్లుగా గ్రామంలో తిష్ట వేసుకున్న సమస్య, స్వయంభుగా వెలసిన పోచమ్మ అమ్మవారి గుడి ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉండడంతో ప్రతి శుభకార్యానికి ఆలయానికి వెళ్లలేని పరిస్థితి ఉండేది, నూతన ఆలయం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమీపంలో నిర్మించినా గ్రామస్తుల నమ్మకం మాత్రం ఆ స్వయంభు ఆలయం పైనే ఉండేది, గ్రామస్తులు సమస్యను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొనుగోటి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లగా, తక్షణమే గ్రామస్తులతో సమావేశమై భూ యజమాని తో మాట్లాడి రహదారి కి తన సొంతంగా భూమి కొనుగోలు చేస్తానని గ్రామస్తులకు మాట ఇచ్చారు. ఇచ్చిందే తరువాయి భూ యజమానితో సంప్రదింపులు జరిపి బుధవారం సదరు భూ యజమానికి 18 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. తాను పుట్టి పెరిగిన గ్రామం కోసం ఏదైనా చేయడానికి సిద్ధమని మరోసారి నిరూపించారు పిఎస్ఆర్ (బాపు) సమస్య పరిష్కారం చూపినందుకు గ్రామస్తులు హర్షాతిరేఖాలు వ్యక్తం చేశారు. పుట్టిన ఊరిపై మమకారంతో తన సొంత ఊరినీ కంటికి రెప్పలా కాపాడుతూ ఎన్నో అభివృద్ధి, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు పిఎస్ఆర్



### ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో తనదైన ముద్ర

ధర్మపురి నియోజకవర్గంలోనే మొదటి దఫా ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో తన సొంత గ్రామానికి సుమారు 100 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి ఇల్ల నిర్మాణాలు మధ్యలో నిలిచిపోకుండా ఆర్థిక భరోసా అందించాలనే లక్ష్యం తో ప్రతి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి తన స్వతహాగా 200 సిమెంటు బస్తాలు అందిస్తానని మాట ఇవ్వడమే కాకుండా ప్రగతిలో ఉన్న ప్రతి ఇంటికి మొదటి దఫా లో 100 సిమెంట్ బస్తాలను అందించడంతో లబ్ది దారులు నిర్మాణాలను మధ్యలో వదిలేయకుండా వేగవంతం చేశారు.

### నేటి రాజకీయాలకు పొనుగోటి ఆదర్శం

"మనం సంపాదించిన దానిలో కొంత మన ఊరి కోసం ఖర్చు చేసినప్పుడే ఆ సంపాదనకు సార్థకత లభిస్తుంది అనేదానికి నిదర్శనమే పిఎస్ఆర్ కేవలం సినిమాల్లోనే కాకుండా నిజ జీవితంలోనూ ఇలాంటి 'శ్రీమంతులు' ఉంటే గ్రామాల రూపురేఖలు మారుతాయని, ఊరి రుణం తీర్చుకునేందుకు పి ఎస్ ఆర్ చేస్తున్న ఈ ప్రయత్నం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తోంది. ఉరి లోనే కాదు నియోజకవర్గంలో తనదైన ముద్ర వేస్తూ రాజకీయ చతురతను ప్రదర్శించడం పిఎస్ఆర్ కే చెల్లింది రానున్న రోజుల్లో రాజకీయంగా ఉన్నత స్థానంలో నిలవాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు.

## వ్యవసాయ మార్కెట్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి



జమ్మికుంట, ఏప్రిల్ 15 (మనం న్యూస్): హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని వ్యవసాయ మార్కెట్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం అన్నారు. హైదరాబాద్ బి.ఆర్.కె భవన్ సమావేశ మందిరంలో బుధవారం చైర్మన్ కోదండ రెడ్డి, కమిషన్ సభ్యుల అధ్యక్షతన తెలంగాణ వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వర్క్ షాప్ లో మార్కెట్ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వప్న సదానందం మాట్లాడుతూ... ఉత్తర తెలంగాణలోనే అతిపెద్ద రెండవ వ్యవసాయ మార్కెట్ గా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ గుర్తింపు పొందిందని అందుకు తగినట్లు వ్యవసాయ మార్కెట్లో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించే సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపడుతున్నామని అన్నారు. పెండింగ్ లో ఉన్న పనులను సైతం త్వరితగతిన పూర్తి చేసేందుకు తగు నిధులు కేటాయించాలని కోరారు. ఈ సమావేశం లో కమిషన్ సభ్యులు భవాని రెడ్డి, భూమి సునీల్ రెడ్డి, కెవిఎన్ రెడ్డి, శ్రీ రాములు నాయక్, శ్రీ రాంరెడ్డి, గోపాల్ రెడ్డి, మార్కెట్ కార్యదర్శి ఎన్. రాజా తదితరులు పాల్గొన్నారు.

## పోషణ పక్వాడ్ కార్యక్రమం

లక్షెట్టిపేట, ఏప్రిల్ 15 : పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఓ రేష్మ ఆధ్వర్యంలో బుధవారం పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల నుంచి వచ్చిన 109 మంది అంగన్వాడీ ఉపాధ్యాయులకు మున్సిపల్ చైర్ పర్సన్ దొంత అంజలి, వైస్ చైర్ పర్సన్ మొతుకూరి రాజేశ్వరి, సిడిపిఓ రేష్మ చేతుల మీదుగా మొబైల్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ ఉపాధ్యాయులతో పిల్లలు ఎలాంటి ఫుడ్ తినాలి ఎలాంటి వాటికి దూరంగా ఉండాలి పిల్లలకి ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎలా అందించాలో తెలియజేస్తూ పలు అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అంగన్వాడీ ఉపాధ్యాయులు పిల్లలకు ఆరోగ్యకరమైన భవిష్యత్ ను ఎలా ఇవ్వాలో తెలియజేస్తూ నా పిల్లలకు వీలైనంత వరకు ఇంట్లో వండిన పోషకవిలువలున్న ఆహారాన్నే అందిస్తాను. జంక్ ఫుడ్, ప్యాకేజ్డ్ ఆహారాల వినియోగాన్ని తగ్గిస్తాను. స్థానికంగా లభించే చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్లను మా కుటుంబ ఆహారంలో భాగం చేస్తాను. నా పిల్లలకు సమతుల్య ఆహారం అందించి, వారి శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడతాను. అంటూ పలు అంశాలపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్స్ మమత, వాణి , రమ, వెంకటలక్ష్మీ, లక్ష్మీపాల్గొన్నారు.



# రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్ఐ




బోయినపల్లి, ఏప్రిల్ 15(మనం న్యూస్ ): బోయినపల్లి మండల కేంద్రం లోని ఆనంద్ విద్యానికేత్ పాఠశాల లో విద్యార్థులకు రోడ్ సేఫ్టీ పై ఎస్ ఐ రమాకాంత్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు పోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపవద్దని ,డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని, హెల్మెట్ ధరించి వాహనాలు నడపవద్దని సూచించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను కూడా వాహనాలు నడపడం లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులతో ఉత్తరాలు రాయించారు. ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు శ్రమదానం నిర్వహించారు బోయినపల్లి గంగాధర ప్రధాన రహదారిలో ఉన్న మట్టిని తొలగించి పలుచోట్ల గుంతలను పూడ్చివేశారు అనంతరం ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రహదారి భద్రత నియమాలు విధిగా పాటించాలన్నారు వాహన ధ్రువీకరణ పత్రాలు కలిగివుండి వాహన తనిఖీల సమయాల్లో ప్రజలు సహకరించాలని అన్నారు. ఏఎస్ఐ గంగరాజు, హెడ్ కానిస్టేబుల్ కనకయ్య కానిస్టేబుళ్లు కరీం పరుశురాం తదితరులు ఉన్నారు

# మైతాపూర్‌లోనే విధులు నిర్వహించాలి



రాయికల్, ఏప్రిల్ 15(మనం న్యూస్) : రాయికల్ మండలం మైతాపూర్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ తలారి నాగమణి ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో బుధవారం సమావేశం నిర్వహించారు. డిప్యూటేషన్ వెళ్ళవద్దని సర్పంచ్, ఉపసర్పంచ్, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను కోరారు. అంకిత భావంతో పని చేస్తున్న మీరందరు ఇక్కడే విధులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు భరోసా కల్పించారు. పాఠశాల సక్రమంగా నడిచేందుకు అందరం సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాఘవులు, ఎస్ఐ సుధీర్ రావు, ఉప సర్పంచ్ దొంగ ప్రణయ్,తలారి రాజేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# మహిళా సమాఖ్య భవనానికి భూమిపూజ



ఇల్లందకుంట, ఏప్రిల్ 15 (మనం న్యూస్): ఇల్లందకుంట మండలం మల్లన్నపల్లి గ్రామంలో మహిళా సమాఖ్య సంఘానికి మంజూరైన భవన నిర్మాణానికి బుధవారం సర్పంచ్ పసునూటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. గ్రామంలోని మహిళా సంఘాలు సమావేశాలు నిర్వహించేందుకు సరైన స్థలం లేకపోవడంతో చెట్ల కింద లేదా సభ్యుల ఇళ్లలో సమావేశాలు ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోందని, దీనివల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమస్యను పరిశీలించిన అధికారులు రూ. 10 లక్షల వ్యయంతో ప్రత్యేక భవన నిర్మాణానికి అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ భవనం నిర్మాణం పూర్తయిన తరువాత మహిళా సంఘాలకు శాశ్వత వేదిక అందుబాటులోకి వచ్చి, వారి కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బండారి మహేందర్, సిఏలు, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో ప్రజలను భాగస్వామ్యులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం



వెల్గటూర్, ఏప్రిల్ 15 (మనం న్యూస్): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి నివేదన లో 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా మండల స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని గురువారం ఉదయం 10 గంటలకు ఎండపల్లి మండలం రాజరాం పల్లిలోని స్థానిక ఎస్ ఆర్ గార్డెన్ లో నిర్వహిస్తున్నట్లు ఎండపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి దొండ కృపాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ ప్రజల నుండి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తూ ప్రభుత్వ నూతనంగా అమలు చేయబోతున్న ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లి ప్రజలను భాగస్వాములు చేయాలని ఉద్దేశంతో ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమానికి మండల స్థాయి పోలీసు, రెవెన్యూ, మండల పరిషత్ ,హౌసింగ్ శాఖల నుండి అధికారులు హాజరవుతారని తెలిపారు.

# రహదారి భద్రతపై వ్యాసరచన పోటీలు




ఇల్లందకుంట, ఏప్రిల్ 15 (మనం న్యూస్): రహదారి భద్రతపై ఇల్లందకుంట, సిరిసేడు, మల్యాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... “అరైవ్ అలైవ్” షెడ్యూల్‌లో భాగంగా “సిరిసేడు ప్రైమరీ స్కూల్, ఇల్లందకుంట, మల్యాల ప్రభుత్వ పాఠశాలల చిన్నారులతో కలిసి రహదారి భద్రతా దినోత్సవం” నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రహదారి భద్రతపై వ్యాసరచన మరియు చిత్రలేఖన పోటీలు నిర్వహించామని అన్నారు. హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులతో వారి వారి తల్లిదండ్రులకు పోస్ట్‌కార్డుల ద్వారా లేఖలు రాయించడం జరిగిందని అన్నారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు సిరిసేడు సెంటర్‌లో విద్యార్థులు మరియు స్థానిక ప్రజలతో కలిసి మానవహారం నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట ఎస్సై క్రాంతి కుమార్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోషణ పక్వాడ పై అవగాహనా




జగిత్యాల/ బీర్పూర్ ఏప్రిల్ 15 ( మనం న్యూస్ : మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ధర్మపురి ప్రాజెక్టు ఆధ్వర్యంలో బీర్పూర్ మండలంలోని తాళ్ల ధర్మారం, చిత్రవేణి గూడెం అంగన్వాడి సెంటర్స్ లో బుధవారం ఐ సి డి ఎస్ సూపర్ వైజర్ శైలజ అధ్యక్షతన ఘనంగా పోషణ పక్వాడ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా షెడ్యూల్ ప్రకారము పుట్టినప్పటి నుండి నుంచి ఆరు సంవత్సరాల పిల్లల యొక్క అభివృద్ధి మైలురాళ్లను చేరుకోవడానికి మరియు అభివృద్ధి మైలురాళ్లను పిల్లలు చేరుకున్నారా,లేదా అనే విషయాలను ఏ విధంగా గుర్తించాలనో తల్లిదండ్రులకు మరియు సంరక్షణకులకు సూపర్వైజర్ శైలజ అవగాహన కల్పించడం జరిగింది . మరియు ఆరు నెలలు నిండిన పాపకు అన్నప్రాసన నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారుతి, పంచాయతీ సెక్రెటరీ లివింగ్ కుమార్ , ప్రైమరీ స్కూల్ టీచర్ ప్రకాష్ , వార్డ్ మెంబర్స్ లక్ష్మణ్, గణేష్ జ్యోతి ప్రమీల లు,ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్స్, సీతుబాయ్ హనుమక్క మరియు తల్లులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లంపల్లిలో నాణ్యత లోపంతో సిసి రోడ్డు నిర్మాణం పనులు

చిగురుమామిడి: ఏప్రిల్ 15 (మనం న్యూస్) : నాణ్యత లోపంతోపాటు సీసీ రోడ్ల నిర్మాణంలో ప్రతిరోజు నీళ్లు పట్టకపోవడంతో తక్కువ కాలంలోనే కంకర తేలిపోవడం,పగుళ్లు రావడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయనీ,నాసిరకం మెటీరియల్ వాడకం, అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ఉల్లంపల్లి గ్రామ వార్డు సభ్యుడు సయ్యద్ షరీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో ఇటీవల పోసిన సిసి రోడ్ల నిర్మాణంలో సక్రమంగా వాటర్ ప్యూరింగ్ చేయటం లేదని,కాంట్రాక్టర్,గ్రామ సర్పంచ్ ఇష్టారాజంగా వ్యవహరిస్తున్నారని ఈ విషయంపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తానని షరీఫ్ తెలిపారు. అధికారుల సమక్షంలో సిసి రోడ్లు పోయాల్సి ఉండగా గ్రామంలో అలా జరగడం లేదని, నిబంధనలు ఉల్లంఘించి సిసి రోడ్లు పోశారని మండిపడ్డారు. పంచాయతీరాజ్ శాఖ ఏఈ సీసీ రోడ్లను పర్యవేక్షించడంలో పూర్తిగా విఫలం చెందారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు జనవేని విజయ్, నర్సింగోజు విజయ్,రావుల రవీందర్,సయ్యద్ చిన్న ఫకీర్, మహమ్మద్ పటాన్ సలీం, సయ్యద్ కమల్,తదితరులు ఉన్నారు.



# గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు

జమ్మికుంట, ఏప్రిల్ 15 (మనం న్యూస్): గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ శ్రవణ్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని మెగా



డయాగ్నస్ సెంటర్ మరియు లోటస్ డయాగ్నిస్ సెంటర్ ను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. తనిఖీలలో భాగంగా సెంటర్ నిర్వాహకులకు పి సి పి ఎన్ డి టి ఆక్టును (గర్భధారణకు ముందు మరియు ప్రసవపూర్వ నిర్ధారణ పద్ధతులు లింగ ఎంపిక నిషేధం చట్టం, 1994.) పకడ్బందీగా అమలు చేయాలని రికార్డులను ఫారం ఎఫ్ లో పొందుపరచాలని సూచించారు. రికార్డులు ఫారం ఎఫ్ లో పొందుపరచకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే వారి మీద పిసి పి ఎన్ డి టి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, డయాగ్నిసిస్ సెంటర్ కు వచ్చే పేషెంట్స్ కు సరైన సౌకర్యాలు కల్పించాలని వారిని ఎటువంటి ఇబ్బందులకు గురి చేయరాదని ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించకూడదని ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, సూపర్వైజర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు పోషణ్ పఖ్వాడా

మల్యాల, ఏప్రిల్ 14,( మనం న్యూస్) :చిన్నారులలో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్ వైజర్ పవిత్ర అన్నారు. మల్యాల మండలంలోని




ముత్యంపేట గ్రామ పంచాయతీ పరిధి కొండగట్టు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పిల్లల నుండి మూడు సంవత్సరాల లోపు పిల్లల అభివృద్ధి మైళురాళ్లు పై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి నెలలో పిల్లలో జరిగే అభివృద్ధి మైలురాళ్లని పర్యావేక్షిస్తు పిల్లలలో ప్రేరణ కలిగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు పద్మ, మమత, వీ.ఓలు, ఆశా వర్కర్లు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

# "హిందూ సమ్మేళన కరపత్ర ఆవిష్కరణ"

జగిత్యాల ఏప్రిల్ 15( మనం న్యూస్ ) : స్థానిక భారత్ సురక్ష సమితి కార్యాలయం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు ఆధ్వర్యంలో విద్యానగర్లోని ఎడ్ల అంగడి లో గల రామాలయంలో



నిర్వహించబోయే హిందూ సమ్మేళన కార్యక్రమానికి సంబంధించి కరపత్రాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సామాజిక సమరసత వేదిక జిల్లా అధ్యక్షులు చిట్ల గంగాధర్ 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి మాట్లాడుతూ ఆర్ఎస్-ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు అయిన సందర్భంగా దేశమంతటా హిందువులను సంఘటితం చేయటానికి హిందూ సమ్మేళనాలు నిర్వహించబడుతున్నాయని దానిలో భాగంగా జగిత్యాల పట్టణంలోని 12 బస్తీలలో ఈ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని హిందువులు తమ తమ బస్తీలలో జరిగే కార్యక్రమాలలో పాల్గొని తమ ఐక్యతను చాటాలని కోరారు అలాగే 18వ తేదీన ఎడ్ల అంగడిలోనీ రామాలయంలో నిర్వహించే బోయే హిందూ సమ్మేళనానికి అధిక సంఖ్యలో హిందువులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక కౌన్సిలర్ అరవ లక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అక్కినపల్లి కాశీనాథం కార్యదర్శి సింగం గంగాధర్ ఉపాధ్యక్షులు వేముల పోచమల్లు నరేందుల శ్రీనివాస్ ఇల్లెందుల పురుషోత్తం బొందుకూరి శ్రీనివాస్ సిరిపురం గంగారాం దొనకంటి రాజేశ్వరరావు కొత్తకొండ భాశెట్టి దుబ్బ రాజం తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రస్థాయి ఫస్ట్ మార్కులు కరీంనగర్‌లోని కోట రెజోనెన్స్ విద్యార్థులకు రావడం గర్వకారణం

కరీంనగర్ ఏప్రిల్ 15(మనం బ్యూరో) : కరీంనగర్ లోని కోట ఇన్స్టిట్యూట్ వారి రెజోనెన్స్ జూనియర్ కాలేజ్ కరీంనగర్ కు ఇంటర్ ఫలితాల ద్వారా రాష్ట్ర స్థాయి గుర్తింపు తెచ్చి పెట్టిందని ఇది కరీంనగర్ కు గర్వకారణమని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు కరీంనగర్ లోని రేకుర్తి లో గల కెపిఎస్ హైస్కూల్లో కోట రెజోనెన్స్ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి ఫస్ట్




మార్కులు వచ్చిన సందర్భంగా బుధవారం ఏర్పాటుచేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు కరీంనగర్లో అనతి కాలంలోనే కార్పొరేట్ కళాశాలలను తలదన్నేలా గ్రామీణ ప్రాంతం నుండి మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలనె ఉద్దేశంతో ఉత్తమ పౌరులుగా తయారు చేయాలనే సంకల్పంతో కోట విద్యాసంస్థలను స్థాపించిన చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు ప్రపంచంలో చదువును మించిన ఆయుధం లేదని కష్టపడి చదువుకున్న వారే ఉన్నత స్థానాలలో ఉన్నారని కోట విద్యాసంస్థలు భవిష్యత్తులో మరిన్ని అద్భుత విజయాలు సాధించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆకాంక్షించారు మరో అతిథి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చిన అంజిరెడ్డి కరీంనగర్ కు రాష్ట్రస్థాయిలో కీర్తి తీసుకురావడం మనందరికీ గర్వకారణం అన్నారు ఫలితాలు రావడానికి ఇంకా టైం పడతది అనుకున్నా ఒక యజ్ఞంలా కృషిచేసి తొందరలోనే ఫలితం వచ్చేలా కృషిచేసిన డాక్టర్ డి అంజిరెడ్డి ఇదే స్ఫూర్తితో రాష్ట్రస్థాయి పరంపర కొనసాగించాలని కోరారు కోట ఇన్స్టిట్యూట్ అనేది ఇప్పుడు కరీంనగర్లో బ్రాండ్ ఇమేజ్ గా మారిందని కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు రాబోయే రోజుల్లో నెంబర్ వన్ గా కరీంనగర్ను తీర్చిదిద్దాలనే దానికి కోట విద్యాసంస్థలు బాటలు వేశాయని అన్నారు మరో అతిథి ట్రస్మ అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి యొక్క క్రమశిక్షణ అతనిని బ్రాండ్ ఇమేజ్కు దగ్గరగా తీసుకు వెళ్లిందని అన్నారు కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థులు ఎక్కడికో వెళ్లకుండా స్మార్ట్ క్లాస్ విద్యా విధానం ద్వారా స్థానికంగానే మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో కోట విద్యాసంస్థలను స్థాపించి తొలి ప్రయత్నం లోనే రాష్ట్రస్థాయి మార్కులు సాధించడం గర్వకారణంగా ఉందని అన్నారు విద్యార్థులు వారి తల్లిదండ్రులు అధ్యాపక బృందం ఇచ్చిన ప్రోత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని సంచలనాలు నమోదు చేస్తామని డాక్టర్ డి అంజిరెడ్డి అన్నారు.

రాష్ట్రస్థాయిలో ఫస్ట్ మార్క్ సాధించిన ప్రథమ సంవత్సరం ఎంపీసీలో గాలి సౌమ్యశ్రీ 469, ద్వితీయ సంవత్సరం కే సహన శ్రీ 995 , ద్వితీయ సంవత్సరం బైపీసీలోజి రోషిని 993 , బైపిసి ప్రథమ సంవత్సరంలో పి శరణ్య438 లను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ట్రస్మా అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు లు అందించి పూల గుచ్చం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి ప్రిన్సిపాల్ అధ్యాపక బృందం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# అరైవ్-అలైవ్' రోడ్స్ సేఫ్టీ కార్యక్రమం

ఓదెల ఏప్రిల్ 15,(మనం న్యూస్) : పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో పొత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓదెల కేజీబీవీ స్కూల్లో పిల్లలకు పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిగ్నల్స్,హెల్మెట్ వాడకం పై వారి తండ్రులకు ఉత్తరం రాయించడం కార్యక్రమం తో పాటు మానవహారం ఏర్పాటు చేసి రోడ్ భద్రత గురించి వివరించి ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు హెల్మెట్ ధరించే అవసరంపై,ట్రాఫిక్ నిబంధనలపై లేఖలు రాయించే ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపట్టారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని విద్యార్థులు వారి లిప్రియ-ంమైన నాన్నకి,రోడుపై చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. నాన్న హెల్మెట్ ధరించు మాకు తీసుకొనిరా. నాకు ఇంకా అమ్మకు కూడా హెల్మెట్ తీసుకు రా అని లేఖల ద్వారా విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. తహశీల్దార్ కార్యాలయంలో విద్యార్థులచే మానవహారం ఏర్పరిచి ఓదెల తహశీల్దార్ ధీరేజ్ కుమార్ విద్యార్థులచే రోడ్డు భద్రత పై ప్రతిజ్ఞ చేయించారు.ట్రాఫిక్ సిగ్నల్స్ ని,గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాలు ఎలా జరిగాయి అని వీడియో ద్వారా వివరించారు.ఈ సందర్భంగా పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్ మాట్లాడుతూ....మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని,రోడ్డు భద్రతను కాపాడేందుకు మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు,వాహన యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు.డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా లేదా మైనర్గా వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.మైనర్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు,ప్రాణనష్టం,ఆస్తి నష్టం జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా,ట్రాఫిక్ నియమాలను అందరూ పాటించాలని



కోరారు.

**ప్రధాన సూచనలు**

18 ఏళ్ల లోపు వారు వాహనం నడపకూడదని,తల్లిదండ్రులు,సంరక్షకులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని,లైసెన్స్ లేకుండా వాహనం నడపడం శిక్షార్హ నేరమని, రోడ్డు భద్రత నియమాలు,వేగ పరిమితులు, సిగ్నల్స్ తప్పనిసరిగా పాటించాలని. వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వాడకూడదని సూచించారు.జరిమానాలు, మైనర్ డ్రైవింగ్ చేస్తే భారీ జరిమానా,వాహన రిజిస్ట్రేషన్పై చర్యలు,అలాగే చట్టపరమైన శిక్షలు కూడా ఉండే అవకాశం ఉందన్నారు. 2024 నుంచే కొత్త నిబంధనల ప్రకారం మైనర్ డ్రైవింగ్పై 25 వేల జరిమానా,వాహన యజమానిపై చర్యలు వంటి కఠిన నిబంధనలు ప్రచారంలో ఉన్నాయన్నారు. 'అరైవ్-అలైవ్' ఉద్యమంలో భాగంగా రోడ్డు మరణాలను 30% తగ్గించే లక్ష్యంతో ఓదెల మండల వ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



జగిత్యాల ఏప్రిల్ 15 ( మనం ప్రతినిధి ):రాష్ట్ర జేఏసీ సూచనల మేరకు బుధవారం టీజీఈజేఏసి జగిత్యాల జిల్లా కార్యవర్గ సమావేశం జేఏసీ జిల్లా చైర్మన్ మిర్యాల నాగేందర్ రెడ్డి, జిల్లా కన్వీనర్ కందుకూరి రవి బాబు గార్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ఇట్టి కార్యక్రమానికి ఉద్యోగ,గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయ,కార్మిక పెన్షనర్స్ మరియు క్లాస్ ఫోర్, ఔట్సోర్సింగ్ భాగస్వామ్య సంఘాల ప్రతినిధులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మిక ఉ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎ+జుజేఏసి) రాష్ట్ర కమిటీ విస్తృతస్థాయి కార్యనిర్వాహక సమావేశం (తేది: 07-04-2026)లో తీసుకున్న తీర్మానాల మేరకు, గౌరవ ఎ+జు-జేఏసి రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రాలు అందజేయుటలో భాగంగా తేదీ:17.4.2026 (శుక్రవారం) రోజున మధ్యాహ్నం భోజన విరామ సమయంలో జిల్లా కేంద్రం లో కలెక్టరేట్ ఎదుట, డివిజన్ మరియు అన్ని మండల కేంద్రాలలో టీజీఈ జాక్ జగిత్యాల జిల్లా పక్షాన భోజన విరామ సమయంలో జేఏసీ సభ్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లుగా తెలిపారు

టీజీఈ జాక్ ప్రధానంగా క్రింది నాలుగు కీలక డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతోంది:

1) 2వ పిఆర్సి అమలు

పిఆర్సి కమిటీ ఏర్పాటు అయ్యి దాదాపు 30 నెలలు పూర్తయిన నేపథ్యంలో, నివేదికను వెంటనే తెప్పించి, జూన్ 2లోపు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

2) పెండింగ్ బిల్లుల విడుదల

రాష్ట్రంలో సుమారు 13,000 కోట్ల పెండింగ్ బిల్లులను ఏకమొత్తంగా విడుదల చేసి, ప్రతినెల రిటైర్ అవుతున్న ఉద్యోగులు మరియు పెన్షనర్లకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

3) ఆరోగ్య కార్డుల అమలు (ఈ ఎచ్ ఎస్ )ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య కార్డుల విధివిధానాలను రూపొందించి వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

4) సీపీస్ రద్దు -- ఒపీస్ పునరుద్ధరణ

రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (జూా)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీం (ఓపిస్ )ను పునరుద్ధరించాలని,

ఇవి కాకుండా, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను కూడా ప్రభుత్వం తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని టీజీఈజాక్ కోరింది. సమావేశంలో వీరితోపాటు టీజీఈ జాక్ జిల్లా కో చైర్మన్లు ఎండి.వకీల్, మామిడి రమేష్, ఊకంటి అమరేందర్ రెడ్డి, పార్దు పి ఆర్ టి యు యాల్ల అమరనాథ్ రెడ్డి, ఎస్ టి యు భైరం హరికిరణ్, టి ఆర్ టి ఎఫ్ తుంగూరి సురేష్, డీటీఫ్ ఎన్నం రాంరెడ్డి, వివిధ సంఘాల జిల్లా నాయకులు సాహెద్ బాబు, గుర్రం శ్రీనివాస్ గౌడ్, హన్మంత రెడ్డి, చంద్ర శేఖర్, సుగుణాకర్, రాజశేఖర్, మధుకర్, హఫీజ్, శ్రీనివాస్, అరుణ, మధుసూదన్, మల్లయ్య, నగేష్, అక్షయ్, సుజాత లక్ష్మి, మాధవి, రహీం, గణేష్, సత్తయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

# నారీశక్తి తో నవభారతాన్ని నిర్మిస్తున్న మోదీ ప్రభుత్వం



కరీంనగర్ ఏప్రిల్ 15(మనం బ్యూరో)..దశాబ్దాల నిరీక్షణకు స్వస్తి పలుకుతూ , నారీ శక్తివందన్ అధినియం ద్వారా ఆడబిడ్డలకు మోదీ అపురూప కానుక అందించి మోదీ ప్రభుత్వం నవ భారతాన్ని నిర్మిస్తుందని బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ అన్నారు. ఏప్రిల్ 16 న పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించే నారీ శక్తి వందన్ అధినియం బిల్లును ప్రవేశపెడుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని బిజెపి మహిళా మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం రోజున కరీంనగర్లోని ఎస్ఆర్ఆర్ కళాశాల నుండి పట్టణంలోని పలు ప్రాంతాల మీదుగా మార్క్ ఫెడ్ వరకు స్కూటీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా అధ్యక్షులుగంగాడి కృష్ణారెడ్డి , నగర మేయర్ కోలగని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు జెండా ఊపి వాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా చొప్పరి జయశ్రీ మాట్లాడుతూ మహిళలకు చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్ కల నెరవేరే సమయం వచ్చిందన్నారు. దశాబ్దాలు దేశాన్ని ఏలిన ఏ పార్టీ కూడా మహిళల సంక్షేమం , అభివృద్ధి కోసం ఆలోచన చేయలేదన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం మహిళల సంక్షేమం అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. అలాగే మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించడానికి, 33 శాతం రిజర్వేషన్లు అందించే చారిత్రక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. చారిత్రాక నారి శక్తి వందన్ అధినియం బిల్లుతో మహిళలకు దేశ ప్రధాని పెద్ద గిఫ్ట్ ఇవ్వబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ దేశ శిల్ప, నిర్మల రెడ్డి, కోలగని స్వర్ణ, వరాల జ్యోతి, సాధవేని లావణ్య, కర్రె పద్మ, శ్వేత , ప్రభావతి, గాజిరమ, పొన్నం లక్ష్మి, నాంపల్లి రేణుక, పెద్దపల్లి శ్రీలేఖ, ఎన్నం లక్ష్మి, సరస్వతి, సుమ రమణారెడ్డి,సాయిని మల్లేశం, గుజ్జ శ్రీనివాసరావు, శశిధర్, బీజేవైఎం సంపత్, గుగ్గిళ్ళ రమేష్, సత్యనారాయణ రెడ్డి, సోమిరెడ్డి వేణు,, సునీత, స్వప్న, లావణ్యా రెడ్డి, చైతన్య,, నరేడ్ల ప్రవీణ్ చంద్ర,, బండారి వేణు, చంద్రిక, వివిధ డివిజన్ మహిళలు పాల్గొన్నారు.

# హుజురాబాద్ మున్సిపల్ ఏఈ ఏసీబీ అధికారులకు చిక్కాడు



హుజురాబాద్, ఏప్రిల్ 15 (మనం న్యూస్): ఓ గుత్తేదారి వద్ద లంచం డిమాండ్ చేసిన ప్రభుత్వ అధికారి ఏసీబీ అధికారులకు చిక్కాడు. హుజురాబాద్ మున్సిపాలిటీలో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)గా పనిచేస్తున్న సుధాకర్ రెడ్డి, బుధవారం రూ. 50,000 లంచం తీసుకుంటుండగా కరీంనగర్ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఫిర్యాదుదారుడైన గుత్తేదారు హుజురాబాద్ మున్సిపాలిటీ పరిధిలో వర్షపునీటి కాలువ నిర్మాణ పనులను ఇటీవల పూర్తి చేశారు. ఈ పనులకు సంబంధించిన, కొలతల పుస్తకంలో కొలతలు నమోదు చేయడం మరియు తుది బిల్లును ప్రాసెస్ చేయడం వంటి పనులను పూర్తి చేయడానికి ఏఈ సుధాకర్ రెడ్డి రూ. 50,000 లంచం డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదుపై స్పందించిన ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి ఫిర్యాదుదారుడి నుండి లంచం తీసుకుంటుండగా హుజురాబాద్‌లోని ఆర్టీసీ డిపో సమీపంలో ఏసీబీ బృందం దాడి చేసి నిందితుడిని పట్టుకుంది. నిందితుడి వద్ద దొరికిన లంచపు డబ్బును రసాయన పరీక్షల అనంతరం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడైన అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)ని అరెస్టు చేసి, కరీంనగర్‌లోని ఎస్పీఈ ఉ ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరచనున్నారు.

## హిందూ సమ్మేళనాలు విజయవంతం చేయాలి



శంకరపట్నం ఏప్రిల్ 15 (మనం న్యూస్) : శంకరపట్నం మండలంలో ఉప మండల వారిగా హిందూ సమ్మేళనాలు విజయవంతం చేయాలని జిల్లా హిందూ సంఘ బాధ్యులు బాలరాజు పిలుపునిచ్చారు. శంకరపట్నం మండలంలోని లక్ష్మీప్రసన్న గార్డెన్ లో ఏర్పాటుచేసిన హిందూ సమ్మేళన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ పార్టీలకతీతంగా మండలంలోని కేశవపట్నం, మొలంగూర్, గద్దపాక, తాడికల్ ఉప మండలాలలో హిందూ సమ్మేళనాలు నిర్వహించి హిందు ఐక్యతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉప మండలాల వారీగా నిర్వహించే సమ్మేళనాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల హిందూ ప్రముఖులు పాల్గొన్నారు

# పోషణ పక్వాడ్‌పై అవగాహన

జగిత్యాల /సారంగాపూర్ ఏప్రిల్ 15 ( మనం న్యూస్ ): మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ధర్మపురి ఆధ్వర్యంలో సారంగపూర్ మండలంలోని బట్టపెల్లి గ్రామంలో సూపర్ వైజర్ లత అధ్యక్షతన పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా షెడ్యూల్ ప్రకారము పుట్టినప్పటి నుండి నుంచి ఆరు సంవత్సరాల పిల్లల యొక్క అభివృద్ధి మైలురాళ్లను చేరుకోవడానికి మరియు అభివృద్ధి మైలురాళ్లను పిల్లలు చేరుకున్నారా,లేదా అనే విషయాలను ఏ విధంగా గుర్తించాలనో తల్లిదండ్రులకు మరియు సంరక్షణకులకు సూపర్వైజర్ లత అవగాహన కల్పించారు . ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మర్రిపెల్లి అశ్విని రమేష్, పంచాయతీ కార్యదర్శి మారుతి, వివోఏ ఆశ కార్యకర్తలు,అంగన్వాడీ టీచర్స్ తల్లులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు



# తెలంగాణ చౌరస్తాలో రోడ్డు భద్రతా అవగాహన




కరీంనగర్, ఏప్రిల్ 15(మనం బ్యూరో)... తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా, కరీంనగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం మూడవ రోజు 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ, మున్సిపల్ మరియు రవాణా శాఖల సమన్వయంతో స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తెలంగాణ చౌరస్తాలో పాఠశాల విద్యార్థులకు భారీ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కమిషనర్ గారు మాట్లాడుతూ.. కేవలం నగరం పరిధిలోనే కాకుండా, కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పాఠశాల విద్యార్థులకు ఈ 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు హెల్మెట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. రహదారి భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని అధికారులు వివరించారు. విద్యార్థులు తమ ఇళ్లలో తల్లిదండ్రులకు కూడా ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించి, వారిని సురక్షితంగా ప్రయాణించేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు వెంకటస్వామి, యాదగిరిస్వామి, ఇన్స్పెక్టర్లు సృజన్ రెడ్డి, రాంచందర్ రావు, తిరుమల్, సంజీవ్, మరియు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# పాఠశాల ముందు రోడ్డు భద్రతకు సైన్‌బోర్డులు ఏర్పాటు : పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్




ఓదెల ఏప్రిల్ 15,(మనం న్యూస్) : పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్ ఆధ్వర్యంలో బుధవారం వశిష్ట ఇంగ్లీష్ మీడియం పాఠశాల,విశ్వభారతి విద్యానికేతన్ పాఠశాలల ముందు రోడ్డు భద్రత,విద్యార్థుల రక్షణపై అవగాహన కల్పించేలా సైన్‌బోర్డులు ఏర్పాటు చేశారు. విద్యార్థులు,తల్లిదండ్రులు,వాహనదారులు రహదారి నియమాలను పాటించి,పాఠశాల పరిసరాల్లో జాగ్రత్తగా వాహనాలు నడపాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దీకొండ రమేష్ మాట్లాడుతూ... పాఠశాలల ముందు అధిక వేగంతో వాహనాలు నడపడం ప్రమాదాలకు దారితీస్తుందన్నారు.ముఖ్యంగా విద్యార్థుల రాకపోకల సమయంలో వాహనదారులు వేగాన్ని తగ్గించి,జీబ్రా క్రాసింగ్,ట్రాఫిక్ సూచనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.పాఠశాలల వద్ద ఏర్పాటు చేసిన సైన్‌బోర్డులురోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఉపయోగపడతాయని తెలిపారు. మైనర్ డ్రైవింగ్,నిర్లక్ష్య డ్రైవింగ్ వంటి చర్యలు ప్రమాదకరమని,చట్టపరంగా శిక్షిస్తామని హెచ్చరించారు.పాఠశాల పరిసరాల్లో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని అందరూ సహకరించాలని,రోడ్డు నియమాలను కచ్చితంగా పాటించాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంను వశిష్ట పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.కిషన్,విశ్వ భారతి విద్యా నికేతన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.సంతోష్ లు నిర్వహించారు.

# అక్రమంగా వినియోగిస్తున్న సిలిండర్ల స్వాధీనం



జగిత్యాల ఏప్రిల్ 15( మనం ప్రతినిధి ): జగిత్యాలలో పలు హోటళ్లలో బుధవారం నాడు సివిల్ సప్లై అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వివిధ హోటల్లలో అక్రమంగా వాడుతున్న 24 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. కాగా వంట గ్యాస్ అక్రమ వినియోగంపై సివిల్ సప్లై అధికారులు దాడులు నిరంతరం కొనసాగుతాయని ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా అధికారులు తెలిపారు.

# జాతియ స్థాయిలో మెరిసిన అల్ఫోర్స్ సీబీఎస్ఈ విద్యార్థులు




కరీంనగర్ ఏప్రిల్ 15(మనం బ్యూరో) : విద్యార్థులకు పటిష్టమైన ప్రణాళికలతో బోధించినట్లయితే సంచలనాత్మక ఫలితాలను సాధించవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు .స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో సీబీఎస్ఇ ఫలితాల్లో సంచలనాత్మక ఫలితాలు సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి పాత్రికేయుల సమావేశానికి మరియు విద్యార్థుల సన్మాన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. అల్ఫోర్స్ విద్య సంస్థల్లో విద్యార్థులకు చాలా చక్కటి ప్రణాళికలతో మరియు అత్యుత్తమ బోధన సిబ్బందితో బోధన అందిస్తూ జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మక పరీక్షల్లో ప్రశంసనీయమైన మార్కులను సాధింపచేస్తున్నామని హర్షం వ్యక్తం చేస్తూ బుదవారం ప్రకటించినటువంటి సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో అల్ఫోర్స్ హై స్కూల్ కి చెందినటువంటి విద్యార్థులు అత్యుత్తమ మార్కులను సాధించడం పట్ల హర్ష వ్యక్తం చేశారు 103 మంది విద్యార్థులు 500 మార్కులకు గాను 450 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో నూతన చరిత్రను సృష్టించారని హర్షం వ్యక్తం చేశారు. సానీక-494, ఆదిత్య-492, ఎం.శ్రీహిత, ఏ.హర్ష ఆ ఏ.శ్రీనిత 490 మార్కులు, కే.ఓం కార్తికేయ, కె.అస్మిత ఆ కే.అభిజ్ఞ 488 మార్కులు, ఏ.స్వరవిస్మృతి 487 మార్కులు, ఎం.శ్రీగౌరీ 486 మార్కులు, కె.వర్దిని 485 మార్కులు, ఉదయశ్రీ ఆ వి. అభిరామ్ - 484, కే.మోక్స్, జి. సాయి సుశేన్ ఆ ఈ ప్రమేష్ రెడ్డి -483 మార్కులు సాధించారని మరియు విద్యార్థులు వివిధ సబ్జెక్టులలో నూరు శాతం మార్కులు సాధించారని సంతోషం వ్యక్తం చేశారు. ప్రారంభించిన నాటినుండి అల్ఫోర్స్ సీబీఎస్ఇ పై చేయి సాధిస్తుందని ఘనవిజయాలను సాధించుటకై తోడ్పాటు అందిస్తున్న తల్లిదండ్రులకు మరియు అహర్నిశలు కృషి చేస్తున్నటువంటి సిబ్బందికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జాతీయస్థాయిలో మెరిసినటువంటి విద్యార్థులందరికీ అభినందనలు తెలిపి పుష్పగుచ్చాలను అందజేసి రానున్న రోజుల్లో మరిన్ని అద్భుత విజయాలను నమోదు చేసి జిల్లా కీర్తిని ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# మైలారం రాజకీయాల్లో సంచలనం.. బిఆర్‌యస్ సర్పంచ్ కాంగ్రెస్‌లోకి చేరిక



నెన్నెల, ఏప్రిల్ (మనం న్యూస్): మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం మైలారం గ్రామ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బి ఆర్ యస్ పార్టీ సర్పంచ్ సుమలత గురునాథం ప్రేమ్ సాగర్ గౌడ్ గార్లు, ఉప సర్పంచ్ కొమ్ము హరీష్ గారు, వార్డు సభ్యులు సంధనవేణి లక్ష్మి రాములు, జంబి విజయ్, బర్ల ప్రేమ్ కుమార్, నాయిని మల్లేష్ గార్లు కలిసి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ బొమ్మెన హరీష్ గౌడ్ గారు ప్రత్యేక వాహనాల్లో వారిని హైదరాబాద్‌కు తీసుకెళ్లి, గౌరవ ఎమ్మెల్యే శ్రీ గడ్డం వినోద్ వెంకటస్వామి గారిని కలిపారు. అనంతరం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే గారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని అధికారికంగా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గడ్డం వినోద్ వెంకటస్వామి గారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులు పార్టీ బలోపేతానికి ముఖ్యమైన శక్తిగా నిలుస్తారని, మైలారం గ్రామ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఆకట్టుకోవడంతోనే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు నాయకులు వెల్లడించారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బొమ్మెన హరీష్ గౌడ్ గారు మాట్లాడుతూ, గ్రామ స్థాయి నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం పార్టీకి మరింత బలాన్ని ఇస్తుందని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని, గ్రామ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్ గారు, బ్లాక్ అధ్యక్షులు కొమ్ము రాజన్న గారు, జడ భీరయ్య, కొమ్ము తిరుపతి, బత్తిన బాలకృష్ణ, వేల్పుల రాకేష్, సంధనవేణి కిరణ్, జంపం గట్టయ్య గార్లు పాల్గొన్నారు.

# ఇంటర్వ్యూలు పూర్తి చేసుకున్న వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి



బెల్లంపల్లి, ఏప్రిల్ 15, (మనం న్యూస్ ) : సింగరేణిలో కారుణ్యం ద్వారా మెడికల్ అన్ ఫిట్ అయిన కార్మికుల వారసులు ఇంటర్వ్యూ పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారికి వెంటనే ఉద్యోగ పత్రాలు అందజేయాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్ రాజ్ శ్రీనివాసరావు సింగరేణి యాజమాన్యాన్ని కోరారు . బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిలో బుధవారం ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడు నెలల నుంచి ఉద్యోగాల కోసం డిపెండెంట్ లు సుమారు 300 మంది ఎదురుచూస్తున్నారని, వారికి ఉద్యోగ నియామక పత్రాలు ఆలస్యం చేయడం వల్ల ఆర్థికంగా నష్టపోవడంతో పాటు వారి సర్వీస్ కోల్పోతున్నారని ఆరోపించారు. ఉద్యోగ నియామక పత్రాలు ఇప్పించడంలో ఏఐటీయూసీ విఫలం చెందిందని అన్నారు. గత సంవత్సరం నుండి మెడికల్ బోర్డు నిర్వహించకపోవడం వలన 2800 మంది ఉద్యోగులు మెడికల్ బోర్డు కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు.

గుర్తింపు సంఘం ఏఐటియుసి కార్మికులకు అలవికానీ హామీలు ఇచ్చి చేతులు ఎత్తేసిందని సింగరేణి కార్మికులను నట్టేట ముంచిందని అన్నారు. కేసీఆర్ హయంలోనే సింగరేణి కార్మికులకు స్వర్ణ యుగం నడిచిందని, టీబీజీకేఎస్ కృషితోనే ఎనలేని హక్కులు సింగరేణి కార్మికులకు అందుబాటులోకి తేవడం జరిగిందని అన్నారు. 2023లో జరిగిన ఎన్నికలలో గెలిచిన ఏఐటీయుసీ కాలపరిమితి డిసెంబర్ 2025 కే ముగిసినప్పటికీ వారు సర్టిఫికెట్ అందుకోవడంలో ఆలస్యమైన క్రమంలో 2026 ఆగస్టు వరకు వారు కొనసాగనున్నారు అని అన్నారు. ఇప్పటికైనా మేనిఫెస్టో ద్వారా సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలైన 250 గజాల ఇంటి స్థలము, 20 లక్షల వడ్డీ లేని ఇంటి రుణము, పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ తిరిగి చెల్లింపు తదితర హామీలు అమలు చేయాలని గుర్తింపు సంఘం ఏఐటియుసిని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కెసిఆర్, టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉన్నపుడు సాధించిన హక్కులపై కరపత్రం పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఫిట్ కార్యదర్శి ఉదయ్ కిరణ్, సెంట్రల్ కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అనుముల సత్యనారాయణ, ఏరియా నాయకురాలు రసరంజని కుమారి, గోలేటి సిహెచ్పి ఫిట్ కార్యదర్శి మెరుగు రమేష్, భోగి శ్రీనివాస్, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల గర్జనకు సిద్ధం బీఆర్ఎస్



కొడిమ్యాల. ఏప్రిల్ 15 (మనం న్యూస్ ) జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో బుధవారం రోజున బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభను విజయవంతం చేసి, జనసంద్రంగా మార్చాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, సభ ఇంచార్జ్ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి. ఈ సమావేశంలో పాల్గొన్నారు. కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమానికి మండలంలోని ప్రముఖ నాయకులు పునుగోటి కృష్ణారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జగిత్యాలకు రానున్న నేపథ్యంలో భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సూచించారు. మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి పార్టీ చేరికను పురస్కరించుకుని మండల స్థాయి నాయకులతో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలను తరలించేందుకు ఇన్‌చార్జ్‌లకు బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. “కేసీఆర్ రావాలి.. రేవంత్ రెడ్డి పోవాలి” నినాదంతో జగిత్యాల జైత్రయాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఒకప్పుడు రైతు, కూలీల హక్కుల కోసం పోరాటాలకు నిలయమైన జగిత్యాల, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మరో ఉద్యమానికి వేదిక కానుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని, దీనిపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీలో భారీగా చేరికలు ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జగిత్యాల సభకు కొడిమ్యాల మండలం నుంచి జైత్రయాత్రగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పునుగోటి ప్రశాంతి, సర్పంచ్ లు ఉప సర్పంచ్ లు, వార్డ్ మెంబర్లు, యూత్ మండల అధ్యక్షుడు గడ్డం లక్ష్మారెడ్డి, నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రమాదం వారిదే..బాధ్యత లేద..నిర్లక్ష్యం పరాకాష్టకు

జైపూర్, ఏప్రిల్ :15 (మనం న్యూస్): జైపూర్ మండలం కిష్టాపూర్ ఏరియాలో గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు చేపడుతున్న మెగా కంపెనీ నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. కంపెనీకి చెందిన బొలెరో వాహనం అతివేగంగా వచ్చి పెద్దపల్లికి చెందిన మండే రాజు గౌడ్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాడని స్థానిక గ్రామస్తులు తెలిపారు. అయితే, మానవత్వం మంటగలిపేలా వ్యవహరించిన కంపెనీ సిబ్బంది, క్షతగాత్రుడిని ఆసుపత్రికి తీసుకెళ్లకుండా కుందారం ప్రధాన రహదారిపై అనాథలా పారేసి పారిపోయారని బాధితుడి బంధువుల ఆరోపించారు. ఈ దారుణానికి నిరసనగా గ్రామస్తులు, బంధువులు బాధితుడిని మెగా కంపెనీ క్యాంపు ముందు పడుకోబెట్టి ధర్నా చేసినా, అక్కడి అధికారులు కనీసం కనికరించకుండా మొండిగా వ్యవహరించడం గమనార్హం. చివరకు కంపెనీ యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో, బాధితుడి పరిస్థితి విషమించకుండా బంధువులే ఆయన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రాణాలు తీసేలా వ్యవహరించడమే కాకుండా, బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్న మెగా కంపెనీ తీరుపై స్థానికులు నిప్పులు చెరుగుతున్నారు.



# ఘనంగా తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర కన్వీనర్ జన్మదిన వేడుకలు



ఓదెల ఏప్రిల్ 15,(మనం న్యూస్) : పెద్దపల్లి జిల్లాలోని అతిపెద్ద శైవ క్షేత్రమైన ఓదెల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో, ఆలయ డైరెక్టర్ జంగం కొమురయ్య ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రతీక,తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ గుండేటి ఐలయ్య యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మిత్రులు, అనుచరులు,ఉద్యమకారులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారిని దర్శించుకుని,ఐలయ్య యాదవ్ పేరుమీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. అలాగే ఆలయంలో భక్తులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర సాధనలో గుండేటి ఐలయ్య యాదవ్ పాత్ర అపారమని,ఉద్యమ కాలంలో ఎన్నో కష్టాలను భరించి ప్రజల కోసం పోరాడిన నిజమైన ఉద్యమ యోధుడని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా,ఓదెల మండల అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ప్రజానాయకుడిగా అభివర్ణించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం నిర్వహించి,సేవా కార్యక్రమాలతో జన్మదినాన్ని ప్రజల మధ్య జరుపుకోవడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు జంగం కొమురయ్య,కందుల అశోక్ పటేల్, సతురి రాజేశం,తాత ఐలయ్య,కృష్ణా,ఓదెలు, చారలు,కుమార్ పాల్గొన్నారు.

# పేద ప్రజలకు సేవలందించడమే ఆలయ ఫౌండేషన్ లక్ష్యం...!

మానకొండూర్ ఏప్రిల్ 15 (మనం న్యూస్).. పేద ప్రజలకు అవసరమైన విద్య, వైద్య సదుపాయాలకు సంబందించిన సేవలందించడమే ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి మార్గదర్శనం లో నడుస్తున్న ఆలయ ఫౌండేషన్ లక్ష్యమని ఉమ్మడి కరీంనగర్ జిల్లా సభ్యులు తీట్ల రమేష్ బాబు పేర్కొన్నారు. తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామానికి చెందిన నక్క మొండయ్య భార్య లక్మి కి గతంలో అనారోగ్యం వల్ల శస్త్ర చికిత్స ద్వారా మోకాలు పై వరకు తొలగించారు. ఆలయ ఫౌండేషన్ సిఈఓ కీర్తి నాగార్జున ద్వారా హైదరాబాద్ కు వెళ్లిన లక్మికి ఇటీవల కృత్రిమ కాలు అమర్చడం జరిగింది. బుధవారం మొగిలిపాలెం వచ్చిన సందర్బంగా రమేష్ బాబు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సల కోసం నరహరి బసంత్ నగర్ లో పెద్ద ఆసుపత్రి కట్టించినట్లు తెలిపారు. ఉన్నత చదువులతో పాటుగా ఉపాధి కల్పన లో పెద్ద, పెద్ద కార్పొరేటు కంపెనీ ల ద్వారా ఉద్యోగ అవకాశాలకోసం క్యాంప్ లు కూడా ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కృత్రిమ కాలు అమర్చడం కోసంభాధితుల పక్షాన ఫౌండేషన్ ను సంప్రదించిన మాజీ వైస్ ఎంపిపి తుమ్మనపల్లి శ్రీనివాసరావ్ మరియు న్యాయవాది బీజేపీ మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి లకు ధన్యవాదములు తెలిపారు. సర్పంచ్ తాట్ల తిరుపతి,కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి,వార్డు సభ్యులు చెన్నబోయిన రవి,పాశం రాఘవరెడ్డి, ఎల్కపల్లి స్వామి, జక్కుల శ్రీనివాస్, జనార్ధన్ రావు,రవికుమార్, వరుణ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# 33 ఏళ్ల సుదీర్ఘ సేవలు అమోఘం

కరీంనగర్, ఏప్రిల్ 15(మనం బ్యూరో)..పోలీసు శాఖలో హోంగార్డుగా చేరి, మూడు దశాబ్దాలకు పైగా నిస్వార్థంగా సేవలందించిన మండ శ్రీధర్ పదవీ విరమణ సందర్భంగా బుధవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ శ్రీ గౌస్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై, శ్రీధర్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ, కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన మండ శ్రీధర్, తన 33 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో ఎంతో అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. పోలీసు శాఖలో హోంగార్డుల పాత్ర కీలకమని, క్షేత్రస్థాయిలో వారు అందించే సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన శ్రీధర్ శేష జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో గడవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది సమక్షంలో శ్రీధర్‌కు పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. తన సర్వీసు కాలంలో తోటి సిబ్బందితో స్నేహపూర్వకంగా ఉంటూ, విధుల్లో క్రమశిక్షణ పాటించిన శ్రీధర్‌ను పలువురు అధికారులు అభినందించారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో ఏసీపీ (ఏఆర్) ప్రతాప్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (హోంగార్డ్స్) శ్రీధర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రవి మరియు కమిషనరేట్‌కు చెందిన ఇతర పోలీసు అధికారులు, హోంగార్డులు పాల్గొన్నారు.



# గురుకులంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

జైపూర్, ఏప్రిల్ :15 (మనం న్యూస్): జైపూర్ మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో బుధవారం జైపూర్ జోన్ పోలీసులు "అరైవ్ అండ్ అలైవ్" పేరుతో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నియమాలను అలవర్చుకోవడం ద్వారా బాధ్యతాయుత పౌరులుగా ఎదగవచ్చని పిలుపునిచ్చారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం ప్రాణ రక్షణకు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. రోడ్డు భద్రత నియమాల సందేశాన్ని విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు చేరవేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ట్రాఫిక్ నియమాలపై గీసిన చిత్రాలను పరిశీలించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు రోడ్డు భద్రతపై పోస్ట్ కార్డుల ద్వారా లేఖలు రాయడం,నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయడం ఈ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో డీసీపీ ఏ. భాస్కర్, ఏసీపీ వెంకటేశ్వర్లు,సీఐ నవీన్ కుమార్, ఎస్ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# లేబర్ కోడ్లను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి

బెల్లంపల్లి, ఏప్రిల్ 15, (మనం న్యూస్ ) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సింగరేణి గని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తెలంగాణ రాష్ట్రంలో అమలు పరచకుండా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను లేబర్ కోడ్ల పేరుతో కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని అన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా దారులు తెరుస్తూ కార్మికులకు ఉద్యోగ భద్రత, వేతన భద్రత లేకుండా ఈ నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకున్నదన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలు మార్చడమే తమ ధ్యేయంగా పెట్టుకున్నారని ఆరోపించారు. ఇప్పటికే దేశంలోని నవరత్న, మినీ రత్న, మహారత్న కంపెనీలను ఆదాని, అంబానీ జిందాల్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం కట్టబెట్టిందన్నారు. బొగ్గు పరిశ్రమను ప్రైవేటీకరించడంతో పాటు సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసి, కార్పొరేట్లకు కట్టబెట్టడానికి కుట్రలు పన్నుతుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయకుండా ఉపసంహరించుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు ఎన్నం శంకర్, జిల్లాల మోహన్, పోచమల్లు పాల్గొన్నారు.



# టీఎన్టీయూసీ కార్మిక బాట

బెల్లంపల్లి, ఏప్రిల్ 15, (మనం న్యూస్ ) టీఎన్టీయూసీ బుధవారం కార్మికబాట చేపట్టింది. బెల్లంపల్లి సివిల్ డిపార్ట్మెంట్ ఆఫీస్ లో నిర్వహించిన కార్మికబాటలో సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలపై, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి ఠాకూర్ మణిరామ్ సింగ్ మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలో సింగరేణి ఆధీనంలో వార్డులకు నీటి సరఫరా, క్వార్టర్స్ మరమ్మత్తులు చేయడం లేదని అన్నారు. సివిల్ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న కార్మికులకు క్యాంటీన్ లో మంచినీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయలేదని అన్నారు. కోల్ ఇండియాలో కాంట్రాక్ట్ కార్మికులకు ఫస్ట్ కేటగిరి వేతనం చెల్లిస్తున్న సింగరేణిలో మాత్రం చెల్లించటం లేదన్నారు. బెల్లంపల్లిలో ఖాళీగా ఉన్న సింగరేణి క్వార్టర్స్ ను కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని అన్నారు. వెంటనే మందమరి జీఎం సివిల్ డిపార్ట్మెంట్ లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనట్లయితే సివిల్ డిపార్ట్మెంట్ ఆఫీసు, జీఎం ఆఫీసు ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో టీఎన్టీయూసీ నాయకులు గజ్జి దుర్గయ్య, గైని తిరుపతి, బొల్లు మల్లయ్య, బి కుమార్, ఎం రాజయ్య, ఎండి అన్వర్, ఎస్ఎస్ పాండే, జి శ్యామ్, మేకల నర్సింగ్ పాల్గొన్నారు.




# రాష్ట్ర స్థాయిలో మెరిసిన ఎర్దండి విద్యార్థిని పావని

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 15 (మనం న్యూస్):ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామానికి చెందిన విద్యార్థిని యు. పావని రాష్ట్ర స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ కళాశాలలో విద్యనభ్యసించిన ఆమె, ఇంటర్మీడియట్ ఫలితాల్లో 470 మార్కులకు గాను 467 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పావనిని ఘనంగా సన్మానించారు. విద్యార్థి సంఘం నాయకుడు నల్లపు పోతరాజు శ్రీకాంత్ ఆమెను ప్రత్యేకంగా అభినందిస్తూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టుదలతో చదివితే అద్భుతాలు సాధించవచ్చని పావని నిరూపించిందని కొనియాడారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, మంచి ఉద్యోగం సాధించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కల్లెడ గంగాధర్, ఉప సర్పంచ్ తెడ్డు రాజారెడ్డి, లక్కుడి నర్సక్క, గ్రామ కార్యదర్శి మనోజ్, నీరటి రతన్ మరియు తోటి స్నేహితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# వంశవృద్ధి అనుగ్రహించేది గయాక్షేత్రం

కోరుట్ల ఏప్రిల్ 15 (మనం న్యూస్) : మనిషి జీవితంలో వంశాభివృద్ధి అనేది కేవలం కుటుంబ పరంపర కొనసాగింపే కాదు, పితృఋణం తీర్చుకునే పవిత్ర బాధ్యత కూడా. ఈ వంశవృద్ధి దైవానుగ్రహంతోనే సాధ్యమవుతుందని, ఆ దైవ కృపను ప్రసాదించే మహిమాన్విత స్థలం గయాక్షేత్రమని శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ గారు హృదయాన్ని తాకేలా వివరించారు. సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న అష్టాదశ మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞంలో భాగంగా కోరుట్ల వాసవి కళ్యాణ భవనంలో బుధవారం నిర్వహించిన 'శ్రీ వరాహ మహాపురాణ సప్తాహం' మూడవ రోజు కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంతో ఎంతో భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. ప్రారంభంలో సమితి పక్షాన నిర్వాహకులు పిన్నంశెట్టి భానుమూర్తి, భోగ శ్రీధర్ దంపతులు గురువందనం చేసి కార్యక్రమానికి ఆధ్యాత్మిక శోభను చేకూర్చారు. ప్రవచనంలో భాగంగా మహేశ్వరశర్మ గారు గయాక్షేత్ర మహిమను వివరిస్తూ, అక్కడ పితృదేవతలకు పిండప్రదానం చేయడం, అన్నదానం నిర్వహించడం వంటి సేవలు చేస్తే పితృదేవతల ఆశీస్సులు లభించి వంశాభివృద్ధి కలుగుతుందని తెలిపారు. ముఖ్యంగా, మనం బతికున్నంత కాలం తల్లిదండ్రుల పట్ల గౌరవం, విధేయత చూపడం ద్వారానే నిజమైన పుణ్యం సిద్ధిస్తుందని భావోద్వేగంగా పేర్కొన్నారు."నేను, నాది, నా వల్లే" అనే అహంకారం మనిషిని జీవితంలో వెనక్కి నెట్టే ప్రధాన కారణమని, ఈ అహంకారాన్ని జయించినవారే జీవితంలో నిజమైన విజయాలను అందుకుంటారని పురాణాలు చెప్పే గొప్ప సత్యాన్ని మహేశ్వరశర్మ గారు ఎంతో హృదయస్పర్శిగా వివరించారు. ఆయన మాటలు అక్కడికి హాజరైన ప్రతి ఒక్కరి మనసును కదిలించాయి. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు మంచాల జగన్, ప్రధాన కార్యదర్శి బట్టు హరికృష్ణ, కోశాధికారి రేగుంట రాజారాం, పురాణ కమిటీ చైర్మన్ పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు పడిగెల శ్రీనివాస్, పురాణ కమిటీ కన్వీనర్ ఎలిమి బుచ్చన్న, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ చైర్మన్ పడిగెల పవన్, నిర్వాహకులు వొటారి చిన్నరాజన్న, దొంతుల సుందర వరదరాజన్, రుద్ర సుధాకర్, శక్కరి వెంకటేశ్వర్, గుండేటి బృగుమహర్షి, కొత్త గణేష్, కట్టెకోల జనార్ధన్, మాడిశెట్టి రవీందర్, ఎనగందుల రాజేంద్రప్రసాద్, చౌడారపు శ్రీనివాస్, శక్కరి వెంకటేష్, ఎనగందుల శ్రీనివాస్ తదితరులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ విధంగా ప్రతి రోజు జరుగుతున్న ఈ పురాణ ప్రవచనాలు కేవలం జ్ఞానాన్ని మాత్రమే కాదు, మనిషి జీవితాన్ని మార్గదర్శనం చేసే ఆధ్యాత్మిక శక్తిని కూడా అందిస్తున్నాయి.



# ఇబ్రహీంపట్నంలో క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం



ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 15 (మనం న్యూస్): ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం క్షయ వ్యాధి (టీబీ) నిర్ధారణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమాజం నుండి క్షయ వ్యాధిని పూర్తిగా తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని ముందస్తుగా గుర్తించి, సరైన చికిత్స అందించడం ద్వారా మరణాలను నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ శిబిరంలో అత్యాధునిక డిజిటల్ మొబైల్ ఎక్స్-రే మిషన్ ద్వారా సుమారు 78 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఫలితాల ఆధారంగా బాధితులకు అవసరమైన మందులను అందజేస్తామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గోపి, మండల వైద్యాధికారి డాక్టర్ వనజ, ఆరోగ్య కేంద్రం సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రజలు ఆరోగ్య విషయాలలో అప్రమత్తంగా ఉండాలని, లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

# జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



బెల్లంపల్లి, ఏప్రిల్ 15, (మనం న్యూస్ ) : బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద బుధవారం జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈసందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని, ఆకలితో ఉన్నవారి ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని, దాతల సహకారంతో జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం ఉగాది సందర్భంగా 2012 ఏప్రిల్ 13న ప్రారంబించామన్నారు. దాతల సహకారంతో ప్రతి బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. నేడు 401వ సారి శ్రీ లలిత ఫ్యాన్సీ క్లాత్ మార్చంట్ సహకారంతో యాచకులకు, నిరుపేదలు, కూలీలు, చిరువ్యాపారులు, బాటసారులకి ఒక పూట ఆకలి తీర్చేందుకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ అన్నదాన కార్యక్రమం ద్వారా సుమారు 180 మందికి అన్నదానం చేశామన్నారు. ఈ జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం విజయవంతం కోసం మరింత మంది దాతలు ముందుకు రావాలని, సహాయ సహకారాలు అందిస్తున్న దాతలందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాత ముప్పిడి మహేందర్, జనహిత సేవా సమితి ఉపాధ్యక్షులు హనుమండ్ల రమాదేవి, కొట్టె రమేష్, కార్యవర్గ సభ్యులు సకినాల రాజేశ్వర్ రావు, నిచ్చకోల గురుస్వామి, బోనాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# హోరేబు మందిరంలో దైవజనుల ప్రత్యేక ప్రార్థనలు

జైపూర్, ఏప్రిల్ :15 (మనం న్యూస్):జైపూర్ మండలం ఇందారం గ్రామంలో గల హోరేబు ప్రార్థన మందిరంలో పాస్టర్ చిప్పకుర్తి సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ మండలాల నుండి సుమారు 20 మంది పాస్టర్లు హాజరై ఆధ్యాత్మిక బోధనలు చేశారు. ఈ సమావేశానికి ఇందారం గ్రామ సర్పంచ్ మహమ్మద్ ఫయాజ్,ఉపసర్పంచ్ ఎల్కటూరి శివ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాస్టర్లు వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.అనంతరం గ్రామాభివృద్ధి, ప్రజలందరి సంక్షేమం, ఆయురారోగ్యాల కోసం దైవజనులు ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు.




# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను అన్ని మండల కేంద్రాలలో తక్షణమే ప్రారంభించాలి

కోరుట్ల ఏప్రిల్ 15 (మనం న్యూస్) : భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం కథలాపూర్ మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించడం జరిగింది. రైతులు అనేక రోజులుగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వేగవంతంగా కొనుగోలు చేయాలని కోరుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అరకొరగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటివరకు మండల కేంద్రంలో కొనుగోలు ఎక్కువగా కొనుగోలు చేయలేదు కేవలం రెండు లారీల మొక్కజొన్నలు మాత్రమే కొనుగోలు చేయడం జరిగింది. రైతులు అనేక కష్టాల తో మొక్కజొన్న పంటను పండిస్తే ఈ రాష్ట్ర ప్రభుత్వం మార్చి నెలలో మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేయవలసి ఉండే కానీ ఆలస్యం కావడం వల్ల రైతులు ఇతర వ్యాపారులకు దళారులకు మొక్కజొన్న అమ్ముకోవడం జరిగిందని దాదాపు 18 00 రూపాయలకు మాత్రమే మొక్కజొన్న విక్రయించడం జరిగిందన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఎమ్ఎస్పీ ధర 2400 ఉండగా దాదాపు రైతు ఎకరానికి 15000 నుండి 20వేల రూపాయలు నష్టపోవడం జరిగింది ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని వానాకాలంలో నవంబర్ నెల నుండి డిసెంబర్ నెల వరకు మరియు వేసవికాలంలో మార్చి నెల నుండి మే నెల వరకు మొక్కజొన్న కొనుగోలులను మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు



చేయాలని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షులు కోడిపల్లి గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు రానున్న రోజుల్లో వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి ఎలాంటి కటింగు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం లేని పక్షంలో రైతులతో కలిసి భారీ ఎత్తున ఉద్యమం చేస్తామని ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కోడిపల్లి గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్ర పరిశీలనలో కథలాపూర్ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు మల్యాల మారుతి రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వరరావు భారతీయ జనతా పార్టీ నాయకులు గాంధారి శ్రీనివాస్, ప్రసాద్, కాసోజు ప్రతాప్, మహేష్, తెడ్డుమహేష్, జీవన్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.

## రహదారి భద్రతపై పోలీసుల ప్రత్యేక దృష్టి.. నెన్నెలలో పిచ్చి మొక్కల తొలగింపు

నెన్నెల, ఏప్రిల్ 15 (మనం న్యూస్):మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పరిధిలోని నెన్నెల మండల కేంద్రంలో రహదారుల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగిస్తూ పోలీస్ శాఖ ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. రహదారుల పక్కన పెరిగిన పొదలు, పిచ్చి మొక్కల వల్ల వాహనదారులకు స్పష్టమైన దృశ్యం లేకపోవడం, ప్రమాదాలకు దారితీసే పరిస్థితులు ఏర్పడుతున్నాయని గుర్తించిన పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. జేసీబీ యంత్రాల సహాయంతో రహదారుల ఇరువైపులా ఉన్న మొక్కలను తొలగించారు.ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ, ప్రజల భద్రతే తమ ముఖ్య లక్ష్యమని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ఇలాంటి చర్యలు కొనసాగుతాయని చెప్పారు. వాహనదారులు



కూడా ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ విజయ్ పాల్గొని, రహదారులపై భద్రతా చర్యలను పటిష్టం చేశారు.

# నేడు మండలంలో సమావేశం



జైపూర్, ఏప్రిల్ :15 (మనం న్యూస్): జైపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నేడు జరగనున్న మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఏర్పాట్లపై బుధవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు ముందస్తు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జి.సత్యనారాయణ మాట్లాడుతూ... సభకు అన్ని శాఖల అధికారులు తమ శాఖల వారీగా సాధించిన పురోగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ వనజా రెడ్డి, ఎంపీఓ శ్రీపతి బాపు రావు,పంచాయతీ రాజ్ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.రాజ్ కుమార్, గ్రామీణ నీటి సరఫరా సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ ఆర్. మహేందర్, మండల వ్యవసాయాధికారి ఐ.శివ లీల, వైద్యాధికారి ముస్తఫా, మండల విద్యాధికారి బి. శ్రీనివాస్, ఐ.సి.డి.ఎస్ పర్యవేక్షకురాలు సరోజ, గృహ నిర్మాణ శాఖ సహాయ ఇంజనీర్ కాంక్ష, ఏపీఓ బి. బాలయ్య, డి.ఆర్.డి.ఏ క్లస్టర్ కోఆర్డినేటర్ ఎన్. రాజన్న ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం పరిశీలన

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 15 (మనం న్యూస్): జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కృష్ణారావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులు తెచ్చిన ధాన్యాన్ని పరిశీలించి, కొనుగోలు ప్రక్రియ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొక్కజొన్న సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, కొనుగోలు చేసిన మొక్కజొన్నను ఎప్పటికప్పుడు గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు నష్టపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, ఇతర నాయకులు, మార్కెట్ కమిటీ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.